
## మేటి రైతాంగ సేవకులు

# నా- లక్ష్మీనారాయణ



రచన

ఆచార్య ఎన్. జి. రంగా

మేటి రైతాంగ సేవకులు

# నా - లక్ష్మీనారాయణ



ర చ న

ఆచార్య ఎన్. జి. రంగా

సం పా ద కు లు

వెల్లంకి చంద్రపాల్

ప్రథమ ముద్రణ
1981, జులై

'వా హి ని' (వార పత్రిక)
వారి ప్రచురణ
రంగా నగర్,
వి జ య వా డ - 10

వెల. రూ. 10/-

ప్రతులకు
ఎడిటర్,
వా హి ని (వార పత్రిక)
శ్రీ సర్వోత్తమ భవనం
విజయవాడ - 520 006

ముద్రితము
సర్వోదయ ప్రెస్,
విజయవాడ - 6

సంపాదకీయం

# రచయితను గూర్చి

అఖిల భారతస్థాయిలో అభేద్యమైన 'రైతు - కూలీ' ఉద్యమ నిర్మాతగా కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ప్రజల హృదయాలలో గౌరవస్థానం కలిగిన స్వచ్ఛమైన గాంధేయవాది ఆచార్య ఎన్. జి. రంగా. "సత్యం, శివం, సుందరం" అన్న సూక్తి రంగాగారి పట్ల సార్థకంగా అన్వయిస్తుంది.

రంగాజీ కేవలం రాజకీయవేత్తయేకాదు. వివిధ దేశాల ఉత్తమ సారస్వతాన్ని, సంస్కృతిని ఆపోసనము పట్టిన విజ్ఞాననిధి, రచయిత, ఒక ఉద్గ్రంథం. ఏబది సంవత్సరాల కాలంలో ఆయన లేఖిని అజరామర గ్రంథాలను సృజియించినది. రంగాజీలో జీర్ణించి, ఆయన మస్తిష్కంలో సంచితమైన అపార విజ్ఞానానికి మచ్చుతునకవంటి బాహ్యరూపమే వారి అపూర్వ గ్రంథాలయం. అరిపోని విజ్ఞానపిపాస ఆయన విశిష్ట వ్యక్తిత్వంలోని ఒక మణిపూస.

ఎప్పటికప్పుడు ఆయన అత్యంత ఆధునికుడు. ఆలోచనలలో, భావతీవ్రతలో, కాలానికంటే ముందున్న ఆశయాల ఉధృతికి కళ్ళెం వేసిన విప్లవ గుణశీలి, సమున్నత సంస్కర్త. ఇంగ్లీషులోను, తెలుగులోను ఉన్నతమైన మాటల సముదాయంతో ధారాళంగా, గంగాజల ప్రవాహ సమానంగా గంభీరోపన్యాసం చేయగలరు. వ్రాయగలరు. సమకాలీన రాజకీయ, ఆర్థిక. సామాజిక సమస్యలపై రంగాగారు ఉత్కృష్టమైన పరిశీలనా గ్రంథాలు రచించారు. రంగాగారి లేఖినినుండి వెలువడ్డ గ్రంథాలు విజ్ఞాన ఖండికలుగా విలువను, విశిష్టతను సంతరించుకున్నాయి. ఉగ్గుబాలతో రంగరించిన వైదుష్యం. అటు తరువాత అహోరాత్రుల కృషితో ఆర్జించిన శేముషీవిభవం రంగాగారి సొత్తులు. సహస్రమైన అమూల్య ప్రసంగాలు, అనేకమైన గ్రంథాల రచన, ఇంకెన్నో రిపోర్ట్సు! ఇవన్నీ పదవులవల్ల సాధ్యమయ్యేవా? ఇలా రంగాగారి మేధాశక్తినిగూర్చి వర్ణించుకుంటూ పోతూవుంటే ఎంతైనా వ్రాయవచ్చు. అందుకు అర్హత కలిగిన బహుముఖ ప్రజ్ఞావంతుడు రంగాజీ.

ఇక రంగాగారు "మేటి రైతాంగ సేవకులు నా - లక్ష్మినారాయణ" అన్న పేరుతో వ్రాసిన ఈ పుస్తకం విషయం.

గుంటూరు మండలం పండించిన జాతిరత్నాలలో రైతు కుటుంబం నుండి వచ్చిన మేలిరత్నాలు శ్రీ గోగినేని లక్ష్మినారాయణ, శ్రీ ఆచంట నాగయ్యలు. బెంగాల్‌లో విద్యార్థి ఉద్యమాలనుంచి, రైతు ఉద్యమాలు, రాజకీయ ఉద్యమాలలో ప్రవేశించినవారు శ్రీ లక్ష్మినారాయణ అయితే, అప్పికట్లలో రైతు ఉద్యమానికి పునాది వేసినవారు శ్రీ నాగయ్య. అట్టి నిస్వార్థ త్యాగమూర్తుల గూర్చి రంగాగారి ఆలోచనల్లో చైతన్యాన్ని పుంజుకొని, అక్షరాలై, మాటలై, వాక్యాలై పేరాల నుంచి పేజీలై ముందుకు దూసుకొని మన ముందుకు వచ్చిన రచన యిది.

రంగాగారు తమ రచనను శ్రీ లక్ష్మినారాయణ, శ్రీ నాగయ్యల పేర్లను వ్యక్తీకరించేందుకే నిర్దేశించుకున్నప్పటికీ, తద్వారా అనాటి రైతు ఉద్యమ స్వరూప, స్వభావాన్ని తిరిగి మరొకమారు స్ఫురణకు తెచ్చినవారయ్యారు. ఆ రోజుల్లో రైతు కూలీల సమస్యలకు సంబంధించి బ్రిటిష్ ప్రభుత్వము తరువాత జాతీయ ప్రభుత్వము రైతులను ఏ విధంగా నిర్లక్ష్యం చేసింది, కళ్ళకు కట్టినట్టు వ్రాశారు. అనాటి త్యాగంతో కూడు కున్న ఉద్యమాలు, వాటిని ప్రభావితం చేసిన భావాలు, వ్యక్తుల ప్రతిభ గొప్పగా వర్ణించారు.

రంగాగారు తెలుగులో ఎలాగా మాట్లాడుతారో ఆలాగే వ్రాస్తారు. వారి తెలుగు రచనలన్నీ అలానే వుంటాయి. విశేషమేమంటే ఈ రచనలలో సాహిత్య పాకం సమృద్ధిగా వుండటం. వర్ణన అద్భుతంగా వుంటుంది.

శ్రీ రంగాగారు నాగయ్యగారిని గూర్చి వ్రాసినభాగంలో "ఆ గడ్డివామిమీద, ఆ సాయంత్రపు సూర్యుడు దిగుచున్నప్పుడు ఆ గడ్డి అంతా బంగారంగా మారిపోతుంటే, ఆ భాగ్యానికి మా చదువుల భాగ్యాన్ని చేర్చుచుంటిమే !" ఇలా తన చిన్ననాటి స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకుంటూ హృదయాన్ని ఆహ్లాదపరిచే వర్ణనలతో ప్రకృతిపట్ల వారికి గల మక్కువను వ్యక్తీకరించారు.

శ్రీ లక్ష్మినారాయణ గూర్చి వ్రాసిన భాగంలో "వోనాడు ఆ రామానాయుడు, ఆ లక్ష్మినారాయణ తియ్యని కెంపుతెంపు లొలికించు స్వరకవితా గానాన్ని విని ముగ్ధుడై 'లక్ష్మినారాయణ ఈ రైతాంగ విశ్వ విద్యాలయాన్ని సాగించడమేగాక మా పాటలకు స్వరకల్పన చేయు త్యాగయ్యగా వున్నారే ! అని ఆనందపడిరి". అంటూ రంగాగారు, తన సోదరుడు శ్రీ లక్ష్మినారాయణ గ్రామీణ గాయకుడుగా అంత గొప్ప వాడైనందుకు గర్వపడుతూ పై మాటలను వ్రాశారు.

లోకంలో ఎందరో సోదరులు వున్నారు. ఇకముందు వుంటారు. ఇది లోకసహజం. అయితే జాతిని ఆకర్షించిన సోదరులు, జాతి శ్రేయస్సుకే తమ సర్వస్వాన్ని అంకితం చేసిన సోదరులు. ప్రేమకు, ఆప్యాయతకు, ప్రతిరూపంగా నిలచిన సోదరులు చాల అరుదు. కాని శ్రీ రంగా, శ్రీ లక్ష్మినారాయణ, శ్రీ వెంకటప్పయ్య సోదరప్రేమ ఆదర్శ ప్రాయమైనది. వారు ఒకరికొకరు రూపాల్లో దీపాలవలె, ఒకరి భావాలకు ఒకరు వరపిడిరాళ్ళవలె ఆదర్శప్రాయులు. ఈ యదార్థాన్ని కళ్ళకు కట్టినట్లు రుజువు పరచేదే నేటి రంగాగారి ఈ "నా - లక్ష్మినారాయణ" రచన.

– ఎల్లంకి చంద్రపాల్



## అంకితం

మా మువ్వురు అన్నదమ్ముల

కన్న మాతృమూర్తి

**అచ్చమాంబకు,**

మమ్ము అత్యంత అనురాగంతో

పెంచిన తల్లి

**మంగమాంబకు**

ఆరాధనతో అంకితం

రంగా



నిడుబ్రోలు రామానీడు రైతాంగ విద్యాలయంలో జరిగిన ఒక సభలో
ప్రసంగిస్తున్న ఆచార్య ఎన్. జి. రంగా, ఇంకా ఈ
చిత్రంలో రంగాజీకి కుడిప్రక్క 'కళాప్రపూర్ణ' శ్రీ పాతూరి
నాగభూషణం, ఎడమప్రక్క శ్రీ గోగినేని
లక్ష్మీనారాయణ వున్నారు.

# శ్రీ గోగినేని లక్ష్మినారాయణ

మా తమ్ములు శ్రీ లక్ష్మినారాయణ నాకు యెంతో ప్రాణ ప్రదులు. ఆయన దేవుని సాన్నిధ్యమునకు చేరుకున్నారు.

వయస్సు పొందినవారైనా, ఇంతలో అలాగా స్వర్గీయులగుట, వారి భార్యబిడ్డలకేగాక, నాకు, మాతో క్రిందటి అర్థశతాబ్దములో, రైతాంగపు వుద్యమమందు, స్వాతంత్ర్య సంపాదనా వుద్యమాలందు కలసి మెలసి, సేవా కార్యములు సాగించుచున్న లక్షలాది ప్రజా సేవకులకు యెంతో బాధ, కొరతగా వున్నది,

ఇంతమంది సోదర సేవకులు, బిడ్డల లాంటి ప్రచారకులు, మనుమలు వలె వుండు అనుచరుల బొందగల్గుట భాగ్యమే। ఐనా, వారందరికి, స్వంత తల్లితండ్రులద్వారా అందిన లక్ష్మినారాయణ లాంటి సోదరులు, భారతీదేవి లాంటి భార్యలు, స్వయంగా కల్గిన బిడ్డల యెడల మరెంతో అదనపు ప్రేమ, కాంక్ష, చూపెట్టుచున్నారనే బాధ వారికి కలుగకుండా వ్యవహరించుకొనవలసిన బాధ్యత మాలాంటి వారిపై వుంటుంది. మమ్మలాగా అగ్ని పరీక్ష చేస్తుంటారనే భావము భారముగు చుండును. ఇదే అనుభవము మహాత్మునికి, రాజాజీకి కల్గినది. ఈ యగ్ని పరీక్షలో

వారు నెగ్గిరి. ఐతే ఎంత బరువైన పరీక్షో! మా అమ్మాయి వాక్కులెలాగా వారికి కలిగిన బాధ ప్రకటిస్తున్నారో ?--

"మీ లెటర్సు ద్వారా, మీకు మా నాన్న గారి పై గల ప్రేమను, ఆప్యాయతను గ్రహించితిమి దాన్నంతా మేము పంచుకోగలిగితిమి. నాన్న గారి యోగక్షేమముల తెలుసుకోవాలనటూ మీరు చూపుతున్న ఆతురతను, ప్రేమను, మీరు వారి ఆరోగ్యముకొరకై చేస్తున్న వెంకటేశ్వర ప్రార్థనలు, మావిగా తెలుసుకుంటున్నాము.

నాన్న గారి ప్రజా సేవను, మంచితనాన్ని, విశిష్టవ్యక్తిత్వాన్ని మీరంతగా గుర్తించుకొనే వున్నారని మీ లెటర్సు ద్వారా, మరింతగా తెలుసుకొనుట మాకు సంతోషముగుచున్నది."

ఆమాటలు 1981 మార్చి 11 వ తేదీన లిఖించిరి. మార్చి 2 వ తేదీకి, లక్ష్మీనారాయణగారిని "లక్ష్మీ" సదనమునకు తీసుకొచ్చిరట. కొంచెం పాలు తీసుకోగల్గుతున్నారట. మాటసరిగా రాకున్నా, మాట్లాడ ప్రయత్నిస్తున్నారట. అని మరో, కలిసిన అమ్మాయి తెల్పిరి. నా వుత్తరం అందినదట, దాన్ని లక్ష్మీనారాయణగారికిచూపిరట, శ్రద్ధగావిన్నారట, కనవిచ్చి చూచుకున్నారట. ఎవ్వరినుండి, అని తన బిడ్డ అడిగితే నెమ్మదిగా, ప్రయత్నంమీద, కాంతులీను నిండనకళ్ళతో చూస్తూ "రంగాగారిది" అన్నారట! ఎంత అదృష్టము, యింతశక్తి తనతండ్రికి అందినదంటూ, ఆబిడ్డ శ్రీమతి ఉషాకుమారి నాకొక కమ్మనివుత్తరం వ్రాసిరి. అది పన్నెండో తేదీ కందినది. ఇక ఫరవా లేదనుకున్నా।

ఆమధ్య మంగళ వాయిద్యాలతో, అన్నమాచార్యుని "అదుగో, అల్లదుగో" శ్రీనివాసమూర్తి అను శుభోదయం రెండోమారు అందినదిగదా? నాతిమ్మలు తిరిగి తన పాదాలు భూదేవిపై ఆనించుకోగలరనుకుంటున్నా!

అంతను మందోకమారు- నెలక్రితం- అలాగే ఆలాపన, పిమ్మట, ఆయన కంఠములో పేరుకొన్న బంకలాంటి నురుగు కరిగిపోయెగదా। తిరిగి, తేనె,నీరు, గ్లూకోజు, యిన్ని మెతుకుల గంజి అందుకొన్నారుగదా! అయితే తిరిగివస్తున్నారు మనలోకానికి। అనిపించినది.

ఆ 11 వ తేదీననే వ్రాసిరే మన అమ్మాయి! గొప్ప చదువుల అమ్మాయే। "భీష్ముడు అంపశయ్యమీద వున్నట్లే నాన్నగారున్నారు" ఆమాటలలో ఎంతరహస్య మున్నదో. 18 వ తేదీన మరో అమ్మాయి వ్రాసిన లేఖ తెల్పుచున్నది. "పండినపండు యెలాగైతే రాలిపోతుందో అలాగ - మన బంగారుకొండ- వృగి, వ్రాగి భగవంతుని పాదపద్మములవద్ద రాలిపోయిరి"

"వారి మంచితనం, వారు సాగించిన మంచి సేవా కార్యాల ఫలితాలు, వాటిస్మృతులు మిగిలివున్నవి" అంటున్నారొక బిడ్డ.

"మీరు ఎప్పుడూ రాచకీయాలు, ప్రజాసేవల గొడవలలో, బాధ్యతలతో ఆత్మీయులన్న వారిని మరచిపోవడం జరుగుచున్నది." ఈలాంటి వ్యధ నాకునూ కల్గుచున్నది గనుకనే అప్పుడు మాఅమ్మ మంగమ్మకు గొప్ప తలజ్వరం వస్తే,

భారతీదేవీ, నేను సిమ్లానుండి దాడుమీదనా అన్నట్లు వచ్చి వాలి, వారికి కొంత ఉపశమనం వచ్చువరకు వుండగలిగితిమి. అటులే, భారతీదేవీజీ చివరివారమంతా ఆమె సరసన వుండగల్గు అదృష్టము బొందితిని. తిరిగి యిప్పుడు అమెరికా నుండి వాలడంతోటే "నాగా గార్డెన్స్" కు వచ్చి, లక్ష్మి నారాయణగారిని చూచుకొంటిని.

ఐతే అదేమి దర్శనము ఆ డిశంబరులో? ఆచూపుల్లో కాంతియేది? ఆవాలకంలో కదలికయేది? ఆమాటలు వినబడవే! గుర్తించారు కొంతగా. గొప్ప ప్రయత్నం మీద తృప్తి అందించినారు, అదచాలునా? అందింది కబురు భయపడుచున్నట్లే! అస్సాంలో వుండగా. చేరుకున్న ఢిల్లీమీదుగా వారివద్దకు! కన్పడేది యెవ్వరు? తమ్ముళ్లేనా? ఏది స్పృహ? ఆగురక వూపిరాడనివ్వటంలేదే! గుండె, నాడి, వూపిరితిత్తులు, అన్నీ బాగే. గుక్కెనీరు అందదట! వుప్పునీరు నరాల ద్వారా అందిస్తున్నారు. ప్రాణకావాలి. ఎట్లా! డాక్టర్లు మంచివారు. శ్రీ గోపాలకృష్ణ యెంతో శ్రమ చేస్తున్నారు. లక్ష్మినారాయణ ముద్దులమనుమలు, డాక్టరు సతీష్ తన్న ప్రేమంపు బిడ్డలాగా బుజ్జగిస్తున్నాడు!

తన చిన్ననాడు యీ సతీష్‌ను, లక్ష్మినారాయణ "నాగాగార్డెన్స్"లో గోముగా పెంచుకొన్నారుగా? ఆమూరు నాల్గుదినాలు వారివద్ద వుండగల్గినా! మళ్ళ వారివద్దకే చేరినా. పదిరోజులు పదేపదే ప్రతిదినం దర్శించుకొంటున్నా! ఎవ్వరిది! ఏ చిన్నపిల్లవాడ్ని హైస్కూలులో చేర్చితినో! పాఠాలు

పలుకకుంటే, యేవిద్యార్థిని నిడుబ్రోలులోని మా పూర్వీకుల స్థలంలో మాఅమ్మ మాకొరకు నిర్మించుకున్న యింట్లో కడి నంగా పల్కరించుచుంటినో ఆసోదరుని. 1923లో ఇంగ్లాండు నుండి వచ్చినా! హరిజనులందరిని తోటిమానవులుగా మర్యాదచేస్తున్నా! మా వూరి హైస్కూలులోని విద్యార్థులు కొందరు హేళనచేసిరటతెన్ను, తనఅన్నయ్యహరిజనులసరసన భోజనాలు స్వంతయింట్లో బహిరంగంగా చేస్తున్నారని! తన కెంతో కోపమొచ్చిందట.

వారిపై తిరుగబడ్డాడట, ఎవ్వరోయెంతగానో గాయ పరచిరట, నెత్తురు చూచిరట!,ఆ యుద్ధవార్త నాకు అందిస్తూ ఎంతో ఆనందపడుచూ వుండిన ఆ చిన్నలక్ష్మయ్యను దర్శిం చినా. పెరిగినారు, కలకత్తాలో కాలేజీలో చేరినారు. అఖిల బెంగాల్ విద్యార్థి కాంగ్రెసుకు కార్యదర్శిఐనారు. గొప్పగా దేశభక్తుల మధ్య వ్యవహరిస్తున్నారు! ఆ 1933 ప్రత్యేక కాంగ్రెసు జరుపుచున్నారు! అధ్యక్షులుమాలవ్యానుజైలుకు తీసుకెళ్లినారు, రెండోవారు ఆనెగారిని, అల్లే మూడోవారు సేన్ గుప్తా సతీమణి! ఆమె నల్లే జైలుకు తీసుకెళితూ, మమ్మ, వేలకొలదిగా, అరెస్టు చేస్తున్నారు, ఎందరినో లాఠీ లతో మోదినారు, ఎందరికో గాయాలు. నన్ను హౌరా స్టేషనులోనే పట్టుకొన్నారు. పోలీసు బందోబస్తుని అతిక్ర మించి, మా వద్దకు ధైర్యంగాచేరి, ఆహ్వానిస్తున్న ఆ లక్ష్మి నారాయణను, ఆ దెబ్బల ధిక్కరించిన,అరెస్టుకు ముందేదిగిన లక్ష్మినారాయణను దర్శించుకున్నా.

ఈ రోజే వుత్తరాది వారి హోలీ పండుగ - 21 తేదీ నసే చేరింది, నందివాడ నుండి ఆ కలకత్తాలో- ఆసంఘటనల లోపాల్గొన్న దేశభక్తుడు ఆదేవినేని జగన్నాధరావు లేఖ! ఆ స్వాతంత్ర్య సమరఘట్టములలో జైలుబాధ ,లాఠీచార్జీల తియ్యదనము, పోలీసు వారి దుండగాలు, సత్యాగ్రహముల విజయధ్వానాలలో గూడా సంగీతదోరణిలో,వందేమాతరం అంటూ వుండిన లక్ష్మినారాయణను దర్శించినా. ప్రతిరోజూ ప్రొద్దుట ఒక "స్ఫురణ" సాయంత్రపు దర్శనములో మరొక్క "స్ఫురణ" నాకు అందు చుండె!

ఎన్నని? రైతు రక్షణ యాత్రలు యీనాడు చురుకుగా, పలుమారులు, వేలాదిజనాలతో సాగుట పరిపాటి ఐనదిగదా? ఆ1933, 34, 35, 36 లో ఎందరికో ఎంతెంతో భయం! మరెందరికో నిస్పృహ! ఇంకెందరికో రాజకీయ వైముఖ్యం! అప్పుడు వీరులు రైతులలో కరువైరే! అప్పుడు నాపిలుపు అందుకొన్న కొద్దిమందిలో, ఆచంట నాగయ్య పెద్ద. నవనవలాడుచున్న నాతమ్ములు, వెంకటప్పయ్య లక్ష్మినారాయణ, బుచ్చినాయుడు, శ్రీమతి భారతీదేవి ముందు వరసలోకి వచ్చిరి.

ఆనాడు, మాగురించేకాదు, ఆనెహ్రూకుటుంబసభ్యులలాగా బ్రిటీషు ప్రభుత్వాన్నెదిరించుటకు, ముందుముందుకు గుంపుగ గోముగా సాగివస్తున్నప్పుడు ఇప్పటివలె కుటుంబాలవారీగా రారాదు, అన్నవారు లేరు! భళభళ ఎందరెందరు వొక్కొక్క కుటుంబమునుండి నిప్పుల్లోదూకుటకు

వస్తున్నారు అనేవారే! ఐనా, ఎన్నో కుటుంబాలనుండి అలాగా నిరంకుశ ప్రభుత్వమును ధిక్కరించుటకు రాలేక పోయిరి.

మాతిమ్మల పుణ్యఫలముగా, నా సోదరులు ముందడుగు వేసిరి భారతీయ సీతమ్మ! సావిత్రి వ్రతాలవరుసలో భారతీదేవి నడచిరి. ఆనాటి ఆ యం. ఏ. బి. యల్ పట్టాలు పొంది వుద్యోగాలని నిరసించిన మా లక్ష్మీనారాయణను దర్శించుకున్నా!

ఆ దశాబ్దాలలో యెలాగా బ్రిటీషుసామ్రాజ్యశక్తుల నెదిరించుటలో యెన్ని వీరోచిత ప్రచారంచేస్తూ వుండిరో, అంతపట్టుదలతో అప్పుడుస్వరాజ్య అవతరణ పిమ్మట రైతు కూలీలరక్షించుటలో శ్రీ లక్ష్మీనారాయణసాహసోపేతంగా సేవాకార్యముల సాగించిరి. రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని బలవంతంగా అత్యంత తక్కువైన ధరలకు "ప్రొక్యూరు" చేస్తూవుండిన బ్రిటీషుప్రభుత్వాన్ని యెదిరించిరి. ప్రాసిక్యూషను కేసులలెక్కచేయలేదు. జైలుకే వెళ్ళిరి. మాతల్లి-కాయకష్టముతో పంటల నందుకోవడంలో పండిన తల్లి మంగమ్మ. నన్ను, భారతీదేవిని ఆశీర్వదించినట్లెఆయన్ను జైలుకు పంపుకొన్నారు. రైతులకొరకు! గ్రామీణులకోసం జైలునుండి బైటికొచ్చిన తరువాత మరెంతో పట్టుదలతో ధాన్యవుత్పత్తిదారుల సంఘాన్ని స్థాపించిరి. ఆంధ్రరాష్ట్రాన్నంతకు. దానికి తానే అధ్యక్షులు. అలాగాయుద్ధంచేయడానికై వస్తున్న పెత్తనాలకు ఆరోజుల్లో యీనాటి పోటీలు లేవుగా!

జవహరులాల్ జీ పెత్తనంలో కూడా "కంట్రోళ్ళైనా" అని రైతాంగయువకు లడుగుతున్నారు! వారి ప్రశ్నకు సమాధానం ఆలోచించారు శ్రీ వెంకటప్పయ్య, లక్ష్మీనారాయణ శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య.

"యాంటి కంట్రోలుల వుద్యమం" సాగించడం తప్పదన్నారు. అదిమంచిదే। కాని అది "యాంటి" మాత్రమే. కావలసినది మరొకటి వున్నదన్నారు. లక్ష్మీనారాయణ, తిమ్మారెడ్డి గిట్టింపుధర కావాలన్నారు. ఆ రెండు డిమాండ్ల పైన దేశమంతటా ఆందోళన ప్రారంభించాము.

ఆసమయాలలోనే రాష్ట్రకాంగ్రెసు పెత్తనం మాకం దినది. ఆపిమ్మట నేను జాతీయకాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యుడనయ్యాను.

రాష్ట్రప్రభుత్వము మావుద్యమం తమకు వ్యతిరేక మనుకొన్నది. అప్పట శ్రీ జవహరులాలు విసుక్కుంటూ, బస్తీలవారికి ధాన్యాలు కావాలి. రైతులను సహాయ నిరాకరణం చేయాలని ప్రోత్సహించడానికిబదులు ఆహార మంత్రిగా వచ్చి యిరువర్గాలను సమాధాన పరచమంటున్నారు. మహాత్ములు "మంత్రిగా వుండు. కంట్రోళ్ళు తొలగించు. రైతుల నుండిధాన్యాలు బస్తీలకు తీసుకురారాదా" అన్నారు. ఐతే "గిట్టింపుధరలు యివ్వడానికి జవహరులాలువొప్పుకోవద్దా! వారితో అలాగే సహకరించమనండి" అన్నా।

"ముందుగా మంత్రి వర్గములో చేరమనండి, తరువాత వీలునుబట్టి ఆ విషయాలు తేల్చుకోవచ్చు" అన్నారు జవహరులాల్జీ।

"అప్పుడు యెందరో మంత్రి వర్గములో చేరండి. బాపూజీ ఆశీర్వాదమున్నదిగదా। జవహరులాలు గారు మొండి పట్టుపట్టరు లెండి" అంటూవున్నారు. ఆ నాటికి వుద్యోగాలు లేకపోతే బ్రతకలేము అనేవాతావరణం అంతగా పెరుగలేదు. శ్రీ లక్ష్మీనారాయణే గనుక, మంత్రివర్గపు అధికారం యెడల మనస్సుగలిగిన వారైతే నన్ను బలవంతం చేసివారేగదా! "మనకు రైతురక్షణ కావాలి. మంత్రి పదవిలో చిక్కిపోతే, బలహీనమైపోతామేమోననే భయం కల్గుచున్నది".

"ప్రతిరోజు మహాత్ముని ప్రార్థనోపన్యాసాలలో, "కంట్రోళ్ళు" తొలగించమంటున్నారు ఐనా, నెహ్రూ గారు వొప్పుకోవడంలేదే। మనం మంత్రివర్గంలో చేరితే ఆయన చెప్పుచేతలలో నలిగి పోవడమేగా" అన్నారు భారతీదేవి! అప్పుడే గనుక వారిద్దరు మంత్రి పదవి మోహానికి నన్ను లొంగదీస్తే యేమయ్యేదో ?

ఆ పిమ్మట ముప్పయి సంవత్సరాలకు శ్రీ చౌదరి చరణ్‌సింగునెట్లా "డిస్మిస్"చేశారో అట్టిదౌర్భాగ్యంనాకూ కల్గేదే గదా। అట్టి ఆపద నుండి రక్షించారు వారిద్దరు.

మహాత్ములుగూడ మాతీర్మానాన్నే అభినందించిరి. ఇలాంటి అనుభవాలెన్నో!! అలాగా మా లక్ష్మీనారాయణను చూస్తూవుంటే ఆయన నైతికశక్తి తిరిగి ప్రత్యక్షమౌతూవున్నది.

ఆయనకు రాజీ పద్ధతి అంతగా పట్టదు. ప్రజల డబ్బు వృథా చేసేవారంటే చిరాకు. స్వంతానికి కాంగ్రెసు ఫండు వాడుకొనే వారిపై అసహ్యం. నాలో కోపం కొంతగానైనా క్షమించుతూ "ఇకముందు సరిగా వుండండి" అనే ధోరణి నాది. ఆయన అట్లా కాదు. అందరిలో ఆరాధించే వారు; అసహ్యించుకొని, మా బృందమునుండి బహిష్కరించాలనేవారు. అలాగా, ఎందరితోనో విరోధాలొచ్చినాయి. వారందరూ చేరుకొని, పొంచేసి, 1952 అసెంబ్లి ఎన్నికల్లో ఆయన్ను మమ్ము ఓడించినారు. ఎప్పుడూ వ్యథ వ్యక్తం చేసేవారు.

కాంగ్రెసు వారు కొందరు, తదితరులు కుమ్మక్కు అయినారు. ఆయన యేవుద్యోగస్థుడు, అక్రమధనార్జన చేశారని పట్టుకొన్నారో, వాఙ్మూలం సంపాదించి రిపోర్టుచేశారో, ఆ వ్యవహారంలోనే, ఆయన్నే ప్రాసిక్యూటు చేయించాలని, కాంగ్రెసుమంత్రులు కొందరు కుట్ర చేయ ప్రారంభించినారు. ఆవిధంగా, వర్కింగ్ కమిటీలోవున్న నాకు అప్రతిష్ఠకల్పించాలనుకున్నారు. దేవుడు ధర్మాన్ని బలపరచారు. శ్రీలక్ష్మీనారాయణను అప్పటి ముఖ్యమంత్రి శ్లాఘించినారు. అట్టి ఇబ్బందులెన్నో ఆయనకున్న సూటియైన నిర్మొహమాటంవల్ల కల్గుచుండేవి.

కమ్యూనిస్టులు ఆరోజుల్లో రైతాంగ వ్యతిరేక ఉద్యమాలను సాగించేవారు, పెద్ద రైతులు, మధ్య రైతులు, చిన్న రైతులంటూ చీలికలు కల్గించేవారు. వ్యవసాయ కూలీలను రైతులపై ప్రయోగించేసేవారు. అందరిని కలిపివుంచాలి.

అందరు ఒకే శోషితవర్గమని మేము నమ్మినాము. రైతుకూలీలమధ్య సామరస్యము సాధించాలన్నాము. ఇన్నాళ్ళటికి- 30 సంవత్సరాలతరువాత - కమ్యూనిస్టులు ఆనాటి మా ధోరణికి వచ్చినారు.

అప్పుడుమాత్రం, రైతులమధ్య వివాదాలు పెంచుతూ కర్ర, కత్తి, తుపాకులతో సాయుధపోరాటాలు గ్రామాలలో సాగించుతుండేవారు. ఇప్పటివలనే ప్రభుత్వపు బలగాలు రైతుల రక్షించుటకు చాలలేదు. ఆలోచించినాము గ్రామాలలో శాంతినెలాగ నిల్పటాయని! గ్రామసేవాదళాలు పెట్టాలి. రైతుకూలీలను స్వరక్షణకై ప్రోత్సహించాలి. హింసాకాండను ఆపాలనుకున్నాము! గుంటూరుజిల్లాలో యీ శాంతిదళాలను యేర్పరచాము మన లక్ష్మీనారాయణ! ఎచ్చట యెప్పుడు కమ్యూనిస్టులు దోపిడీలు చేయించేవారో, హత్యలు, కాల్పులు సాగించేవారో క్షణాల్లో ఆ ప్రాంతాలకు శ్రీ లక్ష్మీనారాయణ మా మేనల్లుడు ఆచంట శేషయ్య. కల్లూరి వీరయ్య మా కారులో చేరేవారు. పోలీసులను హెచ్చరించేవారు. రైతుకూలీకు ధైర్యమును రిపోసేవారు. శాంతిస్థాపనకు కట్టుడిచేసేవారు. అటులే కృష్ణాజిల్లాలో గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు రైతుకూలీలను రక్షించారు వీరిని హత్యచేస్తామని ఎన్నోసారులు కమ్యూనిస్టుదళాల వారు ఉత్తరాలువ్రాశారు. గ్రామాల్లో నినాదలిచ్చేవారు. దారులు కాచేవారు. మాకు వ్యతిరేకులైన కొందరు మంత్రులు కమ్యూనిస్టులతో చేరివుండినారు. ఏభయంలేకుండా, కాకతీయనాయకులవలె సాహసోపేత వీరులుగావుండి పోరాడిరి

లక్ష్మీనారాయణ। ఆయన్న ఆ గుంటూరులో ఆ రెండు వారాలు భజించినా। అహింసాకాండ కార్యక్రమాన్ని రెండు వర్గాల కమ్యూనిస్టు లిప్పటికి మానుకున్నారు. నక్సలైట్సు మాత్రం యింకా ఆ విధ్వంసకచర్యలనే సాగిస్తున్నారు. వారి నెదిరించుటకు శ్రీ లక్ష్మీనారాయణ, గోరెపాటిలాంటివీరులు అవసరముగదా! వారేమో స్వర్గీయులైరే అని బాధగదా!

రైతులు పండించే పంటలకు సరియగు గిట్టుబాటగు ఖర్చుల భరించి, ఆ పైన రైతులు కూలీలకు తగినంత జీవనోపాధి కలుగుటకు తగినధరలు వుండాలి. ప్రభుత్వము వాటిని సిరీకరిస్తూ, పెరుగుచూవుండే అన్నివస్తువుల ధరలు జీవనోపాదుల అంతస్థులకు తగినట్లుగా వ్యవసాయ ధరలు పెంచుతూవుండాలని నేను ఆ 1923, 1926 నుండి వ్రాస్తున్న. 1930, నుండిఆందోళన చేస్తున్నా। కలకత్తా విశ్వవిద్యాలయమందు, యం. ఏ. ప్రథమశ్రేణిలో ఆర్థిక శాస్త్ర పండితులైనారు. శ్రీ లక్ష్మీనారాయణ. నేను నిర్వచించే, గ్రామీణ రైతుకూలీల ఆర్థికసూత్రములు, ప్రణాళికలను హృదయపూర్వకంగా అంగీకరించి పరీక్షల్లో ప్రథముడుగా రాగల్గినారు.

అట్టి సాంఘికస్థాయి న్యాయం రైతుకూలీలకు అందాలంటే మధ్యవర్తులగు వర్తకులనుండి, బ్యాంకరులనుండి మరితర దళారులనుండి రక్షణఅందాలి. అందుకై ప్రభుత్వ సహకారముతో నడుకుబడు మార్కెట్లు అవసరం. అందుకై ఆందోళన చేసినాము. గుంటూరునకు ఆమార్కెట్టు నేర్పరిచితిమి. దాని కమిటీలోని రైతులకు పెత్తనము అవసరం. నేను

జైలులో వుండగానే దానియెన్నికలు శ్రీ లక్ష్మీనారాయణ నడిపించినారు. విజయం సాధించారు. రైతుఉద్యమంలో వుండిన శ్రీ పుల్లెల రత్తయ్యను దాని కధ్యక్షులుగా తెచ్చుకున్నారు.

అటులే గ్రామాలలో ధాన్యాల నిల్వచేయుటకు గిడ్డంగులు, ధాన్యాలనిల్వలు సరియగు ధరవచ్చువరకునిల్వచేయాలంటే అవసరమగు పరపతి, చివరకు అమ్ముకొనుటకు వ్యవహారికశక్తి రైతులకు అవసరం. అందుకొరకు, సహకారసంస్థలవసరమన్నాము. తెచ్చినాము. పొన్నూరు కేంద్రసంఘానికి శ్రీ లక్ష్మీనారాయణే అధ్యక్షులు గిడ్డంగులు కట్టించిరి. పరపతి అందించిరి. రాష్ట్రమందలి సొసైటీలలో మేటిగా దాన్ని పెంచిరి. ఆ ఆచంట నాగయ్య సహాయముతో జిల్లాలో యెన్నో అట్టి సొసైటీలను పెంచినాము. వాటినన్నిటిని జేర్చి ఫెడరేషను యేర్పరచితిమి. ఆ ఫెడరేషనుకు శ్రీ లక్ష్మీనారాయణే ప్రథమ ప్రెసిడెంటు. పిమ్మట వారి అనుచరులు శ్రీ వెంకటసుబ్బయ్య దాన్ని పెంచిరి.

ఆ ఫెడరేషను రైతుల 'లోన్ సేలు సొసైటీలు' అందించే పంటలను జిల్లాసాయిలో సహకార మార్కెటుల, ద్వారా అమ్మకాలు సాధించాలి. అవకాశము కలిగినప్పుడు యితరరాష్ట్రాలలో, దేశాలలో అమ్మకాలు సాధించాలి. ఆ సిద్ధాంతాలు, ఆలోచనలను ఆచరణలోపెట్టి రైతుల పంటలకు గిట్టుబాటుజరుపు సంస్థలు శ్రీ లక్ష్మీనారాయణద్వారా పెట్టగలిగినాము. వారి సలహాప్రకారం శ్రీ వెంకటసుబ్బయ్య

మిరపకాయలకు సింహళములో మార్కెట్లు సాధించినారు. ఆ ఫెడరేషను తేల్చిన లాభాలతో గొప్ప భవనాన్ని వారి పురి పెత్తనములో నిర్మించినారు. ఆ తరువాత వారు అంత కంటే గొప్పభవనాన్ని నిర్మించగల్గిన పిమ్మట దాన్ని అమ్మి వేశారు. ఆ భవనమే యీనాటి డా॥ గోపాలకృష్ణ ఆస్పత్రి ఆ "నర్సింగుహోములోనే "తండకు శ్రీ లక్ష్మీనారాయణ నర్సింగు పొందుతుండిరి. అలాగా అన్ని రైతురక్షణ భావాలకు ప్రతిరూపమైన ఆ భవనమందు, ఆయన్ను అలాగామన ధోరణిలో లేకనే వూపిరి బహుకష్టముమీద పీల్చుకుంటూ వున్న నా సోదరుని, చిన్నబాలుణ్ని యెలాగా చెక్కిళ్ళు ఫాలము తల నిమురుకుంటూమో అలాగా సన్నిహితంగా ప్రేమతో మిళితమైన దిగులు, దయతో చూచుకొంటూ ఆ పదిరోజులు. దేవుని ప్రార్థిస్తూవుండగల్గితిని.

ఈనాటికీ, ఆయన, మేము వూహించుకొని, కార్యరూపంగా నిర్మాణోత్సవాలు అలాగా వివిధసంస్థలద్వారా ప్రారంభించిన రైతురక్షణ ప్లానులకు భారతప్రభుత్వంసిందు స్వరూపము కల్గించలేకనే వున్నది. రాచకీయ పెత్తనాలలో శ్రీ వోబులరెడ్డి లచ్చన్నలకే ఆయన పెద్ద. వారందరు రాష్ట్రకాంగ్రెసు పెద్దలైనప్పుడు, లక్ష్మీనారాయణ సంహో సంప్రదింపులతో ఆనాటి కాంగ్రెసు పెత్తనాలు సాగించిరి. మంత్రివర్గపు ధోరణికి సారథ్యము చేస్తూవుండిరి. కనుక, ఆయనెప్పుడూ వీరిని వారిని మంత్రులుగానో తండారులు గానో నిర్ణయించుకునే స్థాయిలో వ్యవహరించిరి. ఆరోజుల్లో స్వయంగా తామే మంత్రులు గావాలనే చిన్నచూపు

తలంపులు ఆయనకు వుండేవి కావు. నన్నే కేంద్రమంత్రి వర్గమందు చేరకుండడమే మంచిదనుకున్న స్థాయిగదా వారిది! ఆపిమ్మట, రాజకీయ బాధ్యతలు వదులుకున్నా, ఆయనకు తాను తిరిగి మంత్రులస్థాయిలో వ్యవహరించాలనే నీరస ధోరణి యెప్పుడు రాలేదు. ఎన్నో పరియాయములు నన్ను భారతీదేవిజీని మంత్రివర్గాలకు రమ్మంటూవుండినా, మేము లొంగకుండా వుంటిమి. ఆధోరణే వారికి నచ్చినది. ఆధీమాతోనే అలా కన్పరచకుండా, చల్లగానవ్వుతూనే, మమ్మ బలపరుస్తూ వుండేవారు. తన రాజకీయ సోదరులు, తనపాతాల నందుకున్న శ్రీ తిమ్మారెడ్డి, లచ్చన్న రామారావు, వోబుల రెడ్డి ప్రభృతులు మంత్రులైతే ఆనందపడ్డారు, ఆశీర్వదించారు. తానుమాత్రము తనఅంతస్థు, గాంధేయ అంతస్థు నుండే వారికి సలహాలిచ్చేవారు, ఆదరించేవారు,

పదవులకు పెద్దలుగా వుండాలని, కార్యక్రమాలు సాధించడానికి కార్యకర్తలుగా వుండాలని నాబాధ! దాన్ని ఆచరించడములో ఆయన విజయంపొందిరి. ఇకనది సాధ్యము కాదని తోచింది. మేము మారాజకీయ పంథాను మార్చుకొన్నప్పుడు, ఎవ్వరికి ఏవిధమైన వత్తిడికల్గించలేదు. ‘నాగాగార్డెన్స్’ లో తపస్సుచేస్తూ, విద్యాలయమందు మా అనుచరులకు సలహాలిస్తూ వుండేవారు.

ఏదోవిధంగా ఆయన్ను తమవైపుకు తిప్పుకొని, మా కిసాన్ లోక్ పార్టీనో, ఆపిమ్మట స్వతంత్ర పార్టీనో దెబ్బతీయాలని, రాష్ట్రమంత్రివర్గ నాయకులు, వారి పెద్దలు

యెంతెంతో, ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తూవుండిరి. కేంద్ర మంత్రివర్గమన్నా, రాష్ట్రమంత్రివర్గమన్నా, అగ్రులుచాచ వద్దంటున్న శ్రీ లక్ష్మీనారాయణ, మంత్రుల మంత్రాలకు లొంగుతారా లొంగనే లేదు। భారతీ దేవిజీని మంత్రిపదవి, వద్దన్నారు. శ్రీ లక్ష్మీనారాయణ తన ధోరణిలో అందుకు తానెంతో ఆనందపడినారు. అదీ మనసత్తా! మనధీమా మనవంగడం అంటూవుండినారు. వస్తూవుండేవి, యెన్నో మారులు మాకు భేదాభిప్రాయాలు। ఎందులో? కృషికార్ పార్టీద్వారా రైతుకూలీలు, గ్రామీణుల రక్షించడానికి ఆ ఐదుసంవత్సరాలు తపస్సుచేసినప్పుడు కాదు. దాన్ని నడుపుటకు నిర్ణయించుకున్న వారిసత్తా, ధోరణుల లెక్కించుచున్నప్పుడు। అభ్యర్థుల తేల్చుకున్నప్పుడు। జిల్లా బోర్డు పెత్తందారుల పదవుచున్నప్పుడు। ఆయనకు లగువుబిగువులతో సరిపోదుగా। పెత్తందారులకెప్పుడూ "కాంప్రొమైజు"లు తప్పవుగా!

స్వతంత్రపార్టీద్వారా, 17వ సవరణనుండి రైతాంగపు భూస్వామ్యపు హక్కులను, స్వంతవ్యవసాయ, వుద్యోగ శక్తి, సావకాశములను రక్షించుటకు నేజేయు ప్రయత్నాలుకు ఆయన సమ్మతించిరి. ఐతే, ఆపార్టీ నిర్వాహకులు, మిగతాపార్టీలవారివలెనే వుంటేలాభమేమి? అధికారం, పదవులలో వుండేవారికి డబ్బువిరివిగా వుండును కనుక విసరి వేస్తారు. ప్రభుత్వ వ్యతిరేక పార్టీలవారు, గాంధేయ ధోరణిలో పడిస్తేనే డబ్బుకు కరువగునే। అందరివలె డబ్బును



మనుమరాండ్రతో శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ.

విసిరిపారేసే వారితో మనమెలాగా సాగించగలం! అధికారం అందే అవకాశం కనబడంగానే వదలిపోయే వారితో యెలాగా గ్రామీణ ప్రజారక్షణ దళాలను పెంచగలరు రంగాగారు" అని రైతుపెద్ద ఆంధ్రస్వతంత్రపార్టీ ప్రథమ అధ్యక్షులు. నాకు అనుంగు సహచరుడు కిసాన్ వెంకటసుబ్బయ్యతో ఆలోచిస్తూవుండిరి. "రక్షించుకున్నాం మన రైతులను, 17 వ సవరణ అనే రైతాంగ వ్యతిరేక ఆయుధాన్ని వంచినాము, సీలింగుకు తక్కువభూవసతి గలవారికిక భయంలేదులే" అంటూ, మన గొర్రెపాటిని అభినందించిరి.

స్వతంత్రపార్టీ ద్వారా మనం, బీదలు, గ్రామీణులుకు దూరంగావుంటూ, వారిపేరుతో బిరుదులు, పదవులు, అధికారం అనుభవిస్తూ వుండేవారితో కలయాలసి వచ్చిందే! ఆ మర్యాదలలో మనం యిమడగలమా! అంటూవుండిన లక్ష్మీనారాయణ, ఇంత రక్షణ, రైతులకు సాధించడంలో సాయపడిన స్వతంత్రపార్టీ యెడల అభిమానం ప్రకటించిరి నా సాహసిక ప్రయత్నం, అన్నేళ్ళ పర్యంతం నేను, దేవీజీ, లచ్చన్న, గొర్రెపాటి ప్రదర్శించుకున్న ఓర్పుకు సంతోషపడినారు. నాకు కుటుంబబాధ్యతలు లేకుండా ఎన్నో బాధలు, త్యాగాలు దేవీజీ చేస్తూవుండిరి. తానో? 25 సంవత్సరాల పర్యంతం, లాయరు ప్రాక్టీసు ధారవోసుకున్నారు. పెద్దలిచ్చిన భూవ్యవసాయపు ఆదాయాన్నంతా, రైతాంగ

వుద్యమముకొరకై ధారపోసిరి. తనకుటుంబం పెరుగుచున్నది. వారందరికై తన సమయం, ఆదాయం అందించవలసి యున్నదిగా!

కనుక, ఏపని వున్నైనా ప్రభుత్వము సరసనవుంటేనే అందేది! అప్పుడే రాజకీయపక్షులకు స్వంత ఆస్తిపై ఆధారపడకుండా పెత్తనం సాధ్యమగును. అలా ఆధారపడడం వారికి యిష్టమేలేదు! వుంటున్నారు. నాగా గర్తెన్నులోనే మానాన్న నాగయ్యగారుండినట్లు. మేము చేరుకున్నప్పుడు తన ఆలోచనలు అందించేవారు. అత్యంత తొందరైనప్పుడు వచ్చేవారు నావద్దకు. వ్రాసేవారు, కబురంపేవారు.

శ్రీ తిమ్మారెడ్డి, వోబులరెడ్డి, బాలిరెడ్డి వగైరాలు మమ్ము వదలివెళ్ళినపుడు ఆయనకెంత బాధకల్గినదో? ఎట్లనో 1971 లో, నేను, భారతీదేవి తిరిగికాంగ్రెసుద్వారా ప్రజాసేవచేయుటకు తీర్మానించుకుంటున్నాము "తిరిగి ఆయధికారంకొరకై ఆరాటపడుచుండే వారినుండి రంగాగారికే రక్షణవుంటుందా" అన్నారు "ఆయనకు అధికారం అవసరంలేదు. అనుచరులలో యెందరు వారివలె నిల్వగలరు. వారందరూ వారితో నడువజాలరే? ఆ లచ్చన్న ప్రభృతులు కూడా ఆయనతో నడుచుటకు అంగీకరించలేదే! నాకువయస్సు మీదపడ్డదే?" అనుకుంటూ విద్యాలయంలో జాలిబొందిరట. అట్టి నా లక్ష్మీనారాయణను చూచుకుంటూవున్నా ఆపదిరోజులు ఆ గుంటూరులో।

శ్రీ లక్ష్మీనారాయణ, అఖిలభారతస్థాయిలో మేము ఏర్పరుస్తూ వుండిన కిసాను కాంగ్రెసుసభ లన్నిటిలో పాల్గొంటూ వుండిరి. మద్రాసు (1935) మీరటు, లక్నో, ఫైజ్‌పూర్, కొమిల్లా సభలకు వస్తూవుండిరి. కార్యనిర్వాహకసంఘములలో వారుండిరి. మేమంతా (నేను, స్వామీజీ, యాగ్నిక ప్రభృతులం) జైళ్ళకు పంపబడినప్పుడు, ఆయన జాయింటు కార్యదర్శిగా, భారతీదేవి జనరలు కార్యదర్శిగా, బ్రిటీషువారి "రిప్రెషన్" ధోరణిని యెదిరిస్తూ వుండిరి. మందసా పోలీసు కాల్పుల వల్ల రైతుల పై ప్రయోగింపబడిన కేసులనుండి రైతాంగనాయకుల రక్షించుటకై, కోర్టులలో తనకున్న అడ్వకేట్ శక్తుల నుపయోగించిరి. డిఫెన్సుకు కావలసిన డబ్బు వసూలుచేయడం, గ్రామీణులకు ధైర్యము కల్గిస్తూ పోలీసుల దుందుడుకులు, భయోత్పాతములనుండి రైతుల రక్షించుకుంటూ శ్రీమతి భారతీదేవి శ్రమిస్తూవుండిరి. శ్రీ శ్యాంబాబు, లచ్చన్న "అజ్ఞాతవాసం"లో వుండవలసి వచ్చెను. కొన్నాళ్ళకు, శ్యాంబాబు స్వర్గీయులైరి. జైలునుండి విడుదలైన శ్రీ లక్ష్మీనారాయణ, అండర్‌గ్రౌండులోవున్న లచ్చన్నగారికి, బహిరంగంగా 'వీరనారీమణి' గా వెల్గుచున్న భారతీదేవిగారికి, తాను గొప్పఅండగా నిల్చిరి.

ఇంతలో, ప్రపంచయుద్ధంలో, నాజీలు, రష్యాపైపడుచున్నప్పుడు, తమకు అత్యంతభక్తి ప్రపత్తులు కల్గిస్తున్న రష్యాను రక్షించుకోవడానికై బ్రిటీషువారి సహాయం అవసరమనుకున్నారు ఆనాటి కమ్యూనిస్టులు. కనుక తమకు సం

బంధితమగు సంస్థ లన్నిటిచేత, తనుపార్టీ వలెనే ఆయుద్ధనిర్వ హణలో బ్రిటిషువారిని బలపరచడానికి కమ్యూనిస్టులు ఆ "యుద్ధాన్ని ప్రజాయుద్ధమనడానికి" సాహసిస్తూ వుండినారు. అంతవరకు ఆయుద్ధం సామ్రాజ్య శక్తుల విజృంభణా యుద్ధ మన్నవారేయిలాగా దాన్నే ప్రజాయుద్ధమనసాహసించడం; జాతీయ స్వాతంత్ర్య సంగ్రామమును, మహాత్మజీ నాయక త్వముక్రింద యుద్ధనిర్వహణను యెదిరిస్తూ "క్విట్ యిండియా" ధోరణికి కాంగ్రెసువారు రాలేదని అతితీవ్రంగా వ్యతిరేకి స్తున్న సుభాష్‌చంద్రబోసు, నేను, తదితర రైతుకూలీ నాయ కులు సాగిస్తున్న బ్రిటిషు వ్యతిరేక వుద్యమాన్ని నీరసింప చేయబూనిరి. కిసానుకాంగ్రెసులో వున్న కమ్యూనిస్టులు, ఆజాతీయ స్వాతంత్ర్యసంరంభం వ్యతిరేక ధోరణినియెదిరించ డానికి, అప్పటికే అందరిచేత యేకగ్రీవంగా, అధ్యక్షులుగా ఎన్నుకోబడిన శ్రీమతి భారతీదేవి, ప్రధానకార్యదర్శిగా యెదిగిన శ్రీ లక్ష్మీనారాయణ ప్రకటించిన ధైర్యసాహసాలు కిసానుకాంగ్రెస్‌ను బ్రద్దలుకాకుండా రక్షించుకున్న దక్షత ప్రశంసనీయం.

ఆ కష్టకాలంలో వివిధరాష్ట్రాలు సంచారంచేసిరి వారిద్దరు! కలిసి, వేర్వేరుగా. ఎంతో శ్రమ, ఖర్చు యిబ్బంది లకు వోర్చుకొనిరి.

1942 వచ్చేసరికి కాంగ్రెసు "క్విట్ యిండియా" వుద్యమాన్ని ప్రారంభిస్తున్నది. కమ్యూనిస్టులు ఆయుద్ధాన్నే ప్రజాయుద్ధమనే దేశ విద్రోహ దోరణికి వచ్చిరి. స్వామి

సహజానంద, యిందులాల్ యాగ్నిక్ కమ్యూనిస్టులవైపే మొగ్గిరి. అప్పుడు మేమంతా మహాత్ముని నాయకత్వాన్ని శిరసావహించినాము. సుభాష్‌బాబు, 'నేతాజీ' అవతారంతో "ఐ యన్ ఎ" సైన్యాన్ని నడుపుచున్నాడు। అప్పుడు కిసాను కాంగ్రెసుధోరణినుండి రైతులను వెలుపలికి తెచ్చుకోవడమా? లేక కిసాను సభను శిరసావహించి కాంగ్రెసును యెదిరించి బ్రిటిషు వారిని బలపరచడమా? ఆ క్లిష్ట సమయంలో శ్రీ లక్ష్మీనారాయణ మున్ముందుగా కిసాను కాంగ్రెసు వైస్ ప్రెసిడెంటు పదవికి రాజీనామా చేసిరి. శ్రీమతి భారతిదేవి నేను, మిగతా జాతీయ స్వాతంత్ర్య యోధులందరు కమ్యూనిస్టుల దేశ విద్రోహ ధోరణిని యెదిరిస్తూ వారిహస్తగతమైపోయిన కిసాను సభను వదిలి, రైతాంగపు అఖిలభారత సంస్థకు ప్రప్రథమంగా మేమంతా యిచ్చుకున్న పేరును తిరిగి అందుకోవాలనుకున్నాం! ఆవిధంగా తిరిగి అఖిలభారత కిసాను కాంగ్రెసును స్థాపించితిమి. దానికి శ్రీ లక్ష్మీనారాయణను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొంటిమి. అందులకు ఆయన సమ్మతించడం ఎంతో సాహసోపేత బాధ్యత। స్వంతంగా వేలు ఖర్చుపెట్టుకోవాలి పోలీసుల నెదిరించుకోవాలి, దేశమంతటా పర్యటించాలి, కొంగ్రొత్తగా వివిధ రాష్ట్రాలలో సంఘాలు నిర్మించుకోవాలి. ఇంట్లోనే బైలుదేరిన వారిలాగా వున్న కమ్యూనిస్టుల ప్రయోగాలను యెదిరించాలి. తనకుసర్వశక్తుల నందించుదురు శ్రీమతి భారతిదేవి, గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు అందిరి. ఆనాటి కాంగ్రెస్ పెద్దలు కొందరు మాకు తోడుగా రారైరి. నేను లచ్చన్న, వోబుల రెడ్డి, తిమ్మారెడ్డి

మరెందరో జైళ్ళల్లో మ్రగ్గుచుంటిమి. ప్రతిక్షణం వారికో యుగం, గొప్ప పరీక్ష, ఎంతో ఖర్చు, అంతకు వోర్చుకున్నారు భారతీదేవి, లక్ష్మీనారాయణ।

జాతీయ కాంగ్రెసును మా కిసాను వ్యవహారాలకు సంబంధించినంతవరకు బలపరచుకోవాలి। మిగతా జాతీయ కాంగ్రెసు నాయకులవలెనే, వీరులుగా విజృంభించిరి. ఆపైన యుద్ధనిర్వహణకై బ్రిటిషు ప్రభుత్వం రైతులధాన్యాలను బలవంతంగా కొల్లగొట్టుచుంటె దాన్నెదిరించాలి. యుద్ధ ఋణాల వసూళ్ళను వ్యతిరేకించాలి. ప్రభుత్వానికి ధాన్యలను నిర్బంధంగా అందనీయకుండా చూడాలి ! పోలీసులకు తోడై, రైతుకాంగ్రెసు ప్రచారకుల పట్టిస్తూ వుండిన మ్యాజిస్ట్రేటుల నెదిరించాలి.

అంతటి ద్విగుణీకృత కష్టసాధ్యమగు బాధ్యతలను మేమంతా జైలునుండి 1944లో తిరిగి వచ్చువరకు సాగించిన జాతీయయోధులు, రైతాంగ రక్షకులుగా శ్రీ లక్ష్మీనారాయణ, భారతీదేవి, వెంకటసుబ్బయ్య నాయకోత్తములుగా వ్యవహరించిరి.

వారందరికీ తలలోని నాలుక లక్ష్మీనారాయణ ! ప్రథమశ్రేణి సలహాదారు. తాను లాయరుగా లక్షలు సంపాదించలేదుగాని, వదలివేసిన లాయరు ప్రాక్టీసును కంట్రోళ్ళ నెదిరించు రైతాంగమునకు "లాయరు" గా రక్షణను కోర్టులలో, పోలీసు దురంతాల నరికట్టడంలో విజృంభించిరి.

అట్టి జాతీయపీడుడిని గుంటూరు అంపశయ్యమీద చూసుకుంటూ వుండినాను


ఈ రోజుల్లో, రైతాంగ రక్షణకు అనేక పోటీ సంస్థలు వివిధ రాజకీయ పార్టీలు స్థాపిస్తున్నారు. వారి వారి వైపుకు రైతులను కూలీలను చేర్చుకోవాలని! రైతాంగ మెప్పు బలం పొందాలని! పారిశ్రామిక కూలీలను గురించి యిట్టి పోటీ ప్రయత్నాలు 1942 కు ముందే జరిగినవి. ఏకైక సంస్థతో వుండాలనుకోవడం సహజమే! వేర్వేరు పోటీసంస్థలు, ఎన్నికలపై పార్లమెంటరీ ధోరణిలో రాజకీయ పెత్తనం ఆధారపడుచున్నప్పుడు తప్పవు.

ఆ 1923-30 లో ఏ యొక్క సంస్థ నైనా పెట్టగలుగుట సాహసోపేతమైన యత్నం! అందుమేము ముందడుగు వేయగల్గితిమి. అప్పుడు కీ॥ శే॥ త్రిపురనేని రామస్వామి సంపాదకత్వమున "రైతుల పత్రిక" అందినది. మాకొక బలం. కీ॥ శే॥ మాగంటి బాపినీడు మాకుతోడైనారు. వారి పుస్తకం "మాల మంతి" శక్తివంతమైనవి, 1930 కి కీ॥ శే॥ వేమవరపు రామదాసు నెల్లూరు రామానాయుడు ప్రభృతులు మాకు తోడ్పడి అండ. 1933 లో "మారటోరియమ్" అనే "డాలు" రైతులకు అందాలన్నాం, ఎందరో అప్పులను వాయిదా లేయడమా అన్నారు. జాతీయ నాయకత్వములో 1936-37 రాజాజీయే ముఖ్యమంత్రిగా వచ్చిరి ఆర్థిక శాస్త్రవేత రంగా, ఆ శాస్త్రవేత్తలో ప్రథమ శ్రేణికి జెందిన లక్ష్మీనారాయణ "మారటోరియమ్" తగిన రక్షణా యుధమన్న

వ్పుడు అలాగే రైతుల రక్షిస్తామన్నారు. ఆ పిమ్మట రైతుల అప్పుల నివారణ చట్టాన్ని శాసనసభ చేత అంగీకరింపచేశారు.

ఆ లక్ష్మీనారాయణే! శ్రీ రామనాయుడుగారితో చేరి జమిందారీపెత్తనాన్ని తొలగించేయెడల అదేమాదిరిగా రైతాంగాన్ని పీడిస్తున్న యీనాందారీ పెత్తనం పోవాలన్నారు. ఆంధ్రరాష్ట్ర యీనాందారీ రైతులసంఘాన్నేర్పరచిరి. దాని అధ్యక్షులుగా పదిసంవత్సరాలపాటు కష్టించి ఆ రైతుల సమైక్యపరచి ఆదళారీపద్ధతిని రద్దుచేయించగల్గిరి. అటుల జమిందారీ యీనాందారీ దళారీపద్ధతుల తొలగించిన భాగ్యం రామానాయుడు! లక్ష్మీనారాయణ ప్రభృతులకుఅందినది వారికి నాయకులుగా వుండగల్గుట నాకందిన అనుభవము.

క్రమంగా జిల్లా రైతుసంఘాధ్యక్షత నుండి ఆంధ్రరాష్ట్ర సంఘాధ్యక్షులుగా, అఖిలభారత రైతుకాంగ్రెసు ప్రధానకార్యదర్శిగా లక్ష్మీనాయణ పెరిగిరి. రైతుల రక్షించిరి. ఆనాడు అలాగా ఆ రైతురక్షణ యాత్రలు సభలు సంఘాలకు పెత్తనము చేయుబాధ్యత శిరసావహించునప్పుడు యెవ్వరు మీతమ్ములకీ పెత్తనాలా! అన్నవాడు లేరు. నిప్పుల బుట్టను శిరసావహించు ధీరులానాడు యెందరో లేరుగా! ముందడుగు వేయువారిని కౌగిలించుకొనుట కెందరో వుత్సాహులైవుండుటే గొప్పత్యాగం. అన్ని పెత్తనాలు అలాగా సాహసించి త్యాగులై శ్రీ లక్ష్మీనారాయణ సాగిస్తుంటే ఎంతెంతో పెద్దవుద్యోగాల్లో వున్నవారు జడ్జీలతో



శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ వీరి భార్య శ్రీమతి సత్యవతిదేవి.

సహో అంతటి విద్యాధికులు స్వాతంత్ర్యయోధులుగా బాపూజీ ప్రక్క చేరి నన్ను బలపరుస్తున్నందులకు సంతోష పడేవారు.

రామనాయని రైతాంగ ప్రబోధగీతాలు, గరిమెళ్ళ, త్రిపురనేని జాతీయవీరుల వేల్పుల్లగీతాలు, శెట్టిపల్లి వీరపన్నాలు కీ॥ శే॥ నన్నపనేని వెంకటసుబ్బయ్య లక్ష్మీ నారాయణ పాడుచుండేవారు. సోదరులు శ్రీ వెంకటప్పయ్య తాళం వేస్తూ పాటల పారాయణానికి వేగం కల్పించేవారు. ఏనాడు ఆ రామనాయుడు ఆ లక్ష్మీనారాయణ తియ్యని తెంపు కెంపు లొలికించు స్వరకవిత గానాన్ని విని ముగ్ధుడై "లక్ష్మీనారాయణ యీా రైతాంగ విశ్వవిద్యాలయాన్ని సాగించడమే కాక మా పాటలకు స్వరకల్పన చేయు త్యాగయ్యగా వున్నారే" అని ఆనందపడిరి. అలాగా ఎన్నో పరిణామములు మాకెందరికో వుత్సాహం కల్పించేవారు రైతాంగ లక్ష్మీనారాయణ.

రైతుకూలి వుద్యమానికి 'జమీన్ రైతు' వారపత్రిక వుండెడి. నిప్పులు విరజిమ్మె చెకుముకి రాయిలాంటి రామానాయుడు వున్నారన్నా! రైతుకూలీ ప్రజారాజ్యాశయ ప్రచారానికి వేరేపత్రికకూడా వుండాలన్నారు. శ్రీకాకుళం-విశాఖ-గంజాం ప్రాంతాల రైతాంగ నాయకులు, వారిపెద్ద ప్రసిద్ధ రచయిత న్యాపతి నారాయణమూర్తిగారు. వారు

తోడైనారు. ఈ వరచయిత పండితారాధ్యులకి నా ధోరణి నచ్చినది. లక్ష్మీనారాయణతో అందరుజేరి భారతీదేవిని వొప్పించుకొనిరి.

అట్టి వారపత్రికలు నష్టాల్లోనే వుండునన్నా! ఎంతో కష్టంమీద గ్రామగ్రామాలలో విరాళాలు సేసి, నాయుడు సంపాదించుచుంటిరన్నా! విడకపోయిరి "వాహిని" పత్రికను స్థాపించిరి.

నేను అన్నట్లే "వాహిని"కి యెప్పుడూ దండుగలే! దాహమే! తుదకు యుద్ధకాలంలో విరాళాలు తగ్గిపోయినవి. నష్టాలు పెరిగినవి। భరించే దెవరు? ఎంతోమందిమి జైళ్ళల్లో వుంటిమి. పైగా ఎవ్వరికి పత్రికను నిలబెట్టగల ఆర్థిక స్థోమత వున్నది? మిగిలినవారు రామనీడు విద్యాలయంలో చేరిరి. భరించగల్గిన కొద్దిమంది వంతులు వేసుకొన్నారు. తుదకు యిచ్చుకొన్నది యిద్దరే. లక్ష్మీనారాయణ, భారతీదేవి అప్పటికి లక్ష్మీనారాయణకు బిడ్డలను పెళ్ళిళ్ళు వగైరా సంసారిక భారాలు లెక్కపెట్టుకొనే మతి కలుగలేదు. మా అమ్మ మంగమ్మగారి హెచ్చరికలు వినిపించుకొనే వయస్సు పెరుగలేదు.

ఎంత నష్టమని? ఎట్టిభారమని? ఒక్కసంవత్సరమా? ఏడులు సంవత్సరాలుగదా। ఆ లెక్కలు వేయుమంటారా నాను। పత్రిక వద్దంటిని। కావాలనుకున్నారు. నిలబెట్టవలసిన బాధ్యత భరించాలసిందే నే ధోరణి నాది! భరించినారు లక్ష్మీ

నారాయణ, దేవీజీ। సెక్యూరిటీలు ప్రభుత్వము మింగు తున్నది. 'వాహిని'ని వదలుకున్నాము. క్రాంతిని వెల్గించినాము. దాన్ని ఆర్పివేశారు ప్రభుత్వం. 'గోభూమిని' ప్రారంభించాము. దాన్నికూడా పాతిపెట్టింది ప్రభుత్వం. తిరిగి "వాహిని" ని వెలికితీశాము. ఈలాగా యుద్ధం సాగించినారు దేశస్వాతంత్ర్యోద్యమం కొరకై, రైతురక్షణ కొరకై. అంతటి రోషం, ధైర్యం, తెంపు, కట్టుదల మా రైతాంగ ఉద్యమ వీరులకూ, వారికి వెన్నముక లక్ష్మీనారాయణ. కలుగు భారతీదేవి! అలా నిల్చినారు. ప్రకటించినారు ఆగాంధేయ యుగములో మా పెద్దతనాన్ని మా అందరి ఆశయాలను! వ్యవహారం, వ్యాపారదక్షులైన శ్రీ ఉమామహేశ్వరరావు 1953 నుండి 1965 వరకు। "వాహిని" కి ప్రాణవాయువునందించి నష్టాలను ఆపుదలచేసిరి. తిరిగి యిప్పటి వరకు ప్రతినెల ఆరువందలకు తక్కువగాకుండా మింగుతూనేవున్నది. "ఐనా దేవీజీ తపస్సెంతని! లక్ష్మీనారాయణ కట్టుదల సామాన్యమా! ఈ నాటికీ 45 సంవత్సరాల పర్యంతం "వాహిని" సాగుతూనేవున్నది.

"వాహిని" కే మాత్రమే కాదు ఆయన సంపాదకులు నేనువ్రాస్తూ అన్నుకై అందిస్తూ వున్న పుస్తకాలు- యింగ్లీషులో, తెలుగులో - 1930 నుండి 1955 వరకు ప్రచురించడానికి ఎన్నో విధాల సంపాదకులుగా, సలహాదారుగా లక్ష్మీనారాయణ సేవ చేసేవారు. ఆర్థికబలం భారతీదేవియే హెచ్చుగా సమకూర్చుతూ వుండేవారు.

ఆయన అర్థశాస్త్ర ప్రవీణుడుగదా! నేను పాశ్చాత్య అర్థశాస్త్రమును వొక వంక మార్క్సు సిద్ధాంతాన్ని మరో ప్రక్క సమీక్షించి విమర్శించి మధ్యేమార్గాన స్వంత వుద్యోగుల స్వపోషక వ్యవసాయ, చేతిపరిశ్రమలకు సంబంధించిన ఆర్థిక సాంఘిక ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని క్రమక్రమంగా రూపొందిస్తూ వుంటిని. ఆ 1923-33 ప్రథమ దశాబ్దమందు గ్రామ గ్రామములు తిరిగితి. రైతులు కూలీల ఆర్థిక జీవితధోరణుల లెక్కించితి. వృత్తినిర్వాహణ ధోరణుల పరీక్షించితి. గ్రామీణుల ఆర్థిక దాస్యము తొలిగించే మార్గాలు వెతుకుచుంటిని. కూలీలకు వుద్యోగ ప్రాప్తి హెచ్చుగుటకు, నిరుద్యోగం తగ్గుటకు మార్గాలు, అవకాశాలు లెక్కించుచుంటిని. అదొక తపస్సు! మాసాల పర్యంతం లెక్కలు వేయడమే! స్వంతఖర్చుల మీదనే! గ్రామాలలో చితికిపోతూవుండడమే! దీర్ఘకాలిక ఆకార్యక్రమంలో, నాతమ్ములిద్దరూ, తానుగా అప్పుడే అనుచరుడై వచ్చిన పట్టభద్రత పొందుచున్న శ్రీ గోగినేని వేంకటసుబ్బయ్య నాకు తోడైరి. ఆర్థిక శాస్త్రప్రవీణుడైన లక్ష్మీనారాయణ, తాను కాలేజీలలో చదువుతూ ప్రారంభించి లాయరుగా పెరిగినప్పుడు కూడా, నాతో తిరుగుతూ, శ్రమిస్తూ, లెక్కలు వేశారు ఆలోచనలకు అనుభవాలకు రూపాలు అందించేవారు.

అలా ఆ యిద్దరు పండితులు నాకు అంతకాలం అంత శ్రమతో సహాయం చేస్తూ వున్నందువల్లనే, అన్ని లెఖ్ఖలు

చేర్చినా, పుస్తకాలు వ్రాసినా, మహాత్ముని ఆర్థిక జీవిత ఆలోచనలు, పల్కులకు శాస్త్రసమ్మతమైన బలం కల్గించ గల్గినా ! ఆ ప్రయత్నఫలితంగా రైతుకూలీ ప్రజారాజ్య ఆశయ సిద్ధాంతమునకు లెఖ్ఖలతో కూడిన, పండితులు కాదనజాలని, సిద్ధాంత బలం అందించగల్గినాను. ఆ పిమ్మటే అందువల్ల కూడా 1944-46లో మహాత్ముని ఆశీర్వాదమును మా ధార్మికరైతాంగ కళాకారుల ప్రజారాజ్యాశయమునకు ఆశీర్వాదము సంపాదించగల్గితిమి. ఈ నాడు అట్టి లెక్కలు, సర్వేలు చేసేవారికి లక్ష్మీనారాయణ అంతస్థుల వారికి నెలకు రెండు మూడు వేలు యిస్తున్నారు. మరెన్నో సౌకర్యాలు. ఆనాడు, ప్రతినెలా లక్ష్మీనారాయణ వేయి వరకు, నా ఆజ్ఞమేరకు స్వంతగా ఖర్చుపెట్టుకునేవారు. తన అనుభవం పాండితిని అర్పణ చేస్తూవుండేవారు. ఆ సేవలకు విలువకట్టగలమా! అంతబలం, తేజస్సు మావుద్యమానికి అందించిన లక్ష్మీనారాయణ నా తమ్ములనుకో గల్గిన అదృష్టం మమ్ము పెంచిన అచ్చమాంబ, మంగమ్మ, లక్ష్మీదేవికి రైతాంగోద్యమం ఋణపడివున్నది.

మహాత్ములు, మేము మా తపస్సు, ఆర్థిక సాంఘిక సర్వేలు, గ్రంథప్రచురణల ద్వారా, తన ధోరణికి శాస్త్రీయ స్వరూపము కల్గించితిమని తృప్తి పడినప్పుడు శ్రీ లక్ష్మీనారాయణకు కూడా గొప్ప ఆనందము కల్గినది.

రైతాంగవిద్యాలయమును ప్రప్రథమంగా, రామానీడు భవనాలలో 1933 లో ప్రారంభించినప్పుడు నల్లై

ముందే బైటనుండి వచ్చిన విద్యార్థులు. వారిలో, ముఖ్యులు
శ్రీ వోబుల రెడ్డి, డి. యస్. రెడ్డి. ఆ ప్రథమ ప్రయత్నము
నుండి, ఆనాటి కాంగ్రెస్ పెద్దలలో హెచ్చుమంది, సహాయ
నిరాకరణములో వుండిరి. దేశోద్ధారక నాగేశ్వరరావు
మాత్రము హృదయపూర్వకంగా, మమ్మాశీర్వదించి, ఆంధ్ర
పత్రిక ద్వారా, మేముచేయు ప్రబోధనలు, చెప్పుచదువుల
ఘోరణి, సారాంశములను ప్రచురిస్తూ, పదుల వేల వయోజ
నుల మధ్య మాబోధలు ప్రచురమొనర్చి, తోడ్పడిరి.
క్రమంగా కాంగ్రెసు నాయకులలో యువతరంవారు శ్రీ బాపి
నీడు, మందేశ్వరశర్మ. గోవిందాచార్యులు ప్రభృతులు
మాకు తోడగుచుండిరి.

మా వద్ద బోధలు బొందినవారు తమతమ ప్రాం
తాల్లో వారం, రెండు వారాలు, పర్యంతపు విద్యాలయా
లను నడుపబూనుకొనిరి. అన్నిట, నాతోబాటు, లక్ష్మినారా
యణ ప్రిన్సిపాలుగా వస్తూవుండిరి.

మా ప్రచారము చూచి కమ్యూనిస్టులు తమ విద్యా
లయాలను ప్రారంభించిరి. వారితో కూడా మేముసహకరించ
డానికి తయారై గాంధేయ ఆర్థిక, సాంఘిక, విప్లవబోధన
లను చేస్తూ వుంటిమి. అందుకు వారు వోర్చుకోలేకపో
యినారు. కనుక మా విద్యాలయాలకు యువజనులను వెళ్ళ
వద్దనేవారు! మమ్ము పిలువనప్పుడు, మేము వారిని పిలువ
గలమా?

యిట్లా, యిటునుండి కాంగ్రెసు పెద్దల సహాయ నిరాకరణ, అటునుండి కమ్యూనిస్టుల వ్యతిరేకత మధ్య విద్యార్థుల కొరకు కూడా మేము బహు అవస్థ పడుతుండే వాళం. 1945 వచ్చేసరికి మహాత్ముని ప్రత్యక్ష ఆశీర్వాదములు మా ఆశయానికి అందేసరికి మాకు పండుగే! ఆ పండుగ పర్వదినాల విద్యాలయానికి నాల్గువందల మంది నవయోజనులు విద్యార్థులుగా అందిరి. అప్పుడు లక్ష్మినారాయణ పొందిన సంతోషానికి అంతులేదు.

అన్నేళ్ళ పర్యంతం భోజనాలు చేయిస్తూ పళ్ళ బిగింపుతో ఎమ్మ బలపరుస్తూ వున్న సోదరులు వెంకటప్పయ్యగారు సింహగర్జనలు చేయ మొదలెట్టినారు. తన బిడ్డలు ఇళ్ళకు పోవడమైనా అనుకుంటూ వున్న తల్లి మంగమ్మ గారికి, తన బిడ్డలు గొప్పఆచార్యులైనారనే తృప్తి కల్గుచున్నది.

స్వరాజ్యం రాక తప్పదు అనే విశ్వాసం మాకు వుండినది. జాతీయ స్వతంత్ర్యం వచ్చిన తరువాత రైతులకు, వ్యవసాయ కూలీలకు, కళాకారులకు యే రక్షణాలు హక్కులు, అవకాశాలు అందునో అంటూ ఆలోచన చేయడం అని నేను 1928 లోనే ఆంధ్ర రాష్ట్ర రైతు మహాసభ ద్వారా అడుగుచుంటిని 1945నాటికి, ఆభయానికి అవసరం లేకుండా చేయగల్గిరి. మహాత్ములు తన అమర సందేశం ద్వారా ఆ సందేశం నా ద్వారా అందినందులకు మా తమ్ములు అందిన సోదర సేవకులు, అనుచరులు ఆనందము

పొందుటలో ఆశ్చర్యమేమి! వచ్చినది ఆశించినదే! అందరి కష్టఫలితంగా! మా తమ్ముని ఆశయ సిద్ధిగా! దేశభక్తుల తపోఫలితంగా! స్వాతంత్ర్య వీరుల శ్రమలు, త్యాగాలు, ప్రాణార్పణాల హారతుల జ్యోతిగా భారతదేశపు స్వరాజ్యం అవతరించింది.

మాకు తృప్తి కలుగలేదే! ఇటు, అటూ పాకిస్థాన్! మధ్యలో రెండుభుజాలు పోగొట్టుకున్న భారతమాత. లక్ష్మి నారాయణ ఆశాభంగమునకు అంతులేదు!

ఈ జవహరులాలు, రాజాజీ, సర్దారులింతగా యెందుకు లొంగిపోయారు అంటూ వుండినారు. మహాత్ముడు, నేను ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడుగా ఇంగ్లాండులో ప్రథమ ప్రపంచ రైతుల సభలోవుండగా ఎన్నుకోబడగా, ఆశీర్వదించిరి. లక్ష్మినారాయణ తానుగా రాష్ట్ర కాంగ్రెసు వర్కింగుకమిటీ సభ్యుడుగా వుండలేదు. ఇతర సోదర పెద్దలకు అస్థానాలిస్తూవుండిరి. తాను ప్రత్యేక ఆహ్వానితులే. ఆవిధంగా తనప్రత్యేక ధోరణిని యితర పెద్దలకు ఆదర్శప్రాయంగా ప్రదర్శించిరి. పదవి కాదు ప్రాథమికము, సేవ, సలహాలతో కూడిన సాహచర్యములో విశేషమున్నదని మహాత్ములు చూపిన రాజకీయ నైతిక పంథాను అనుసరించిరి.

ఈ నాడు నేను ఇందిరాజీకి కుడిభుజముగా అలాగనే వ్యవహరించగల్గుచున్నా. ఆ 1946_51 లో లక్ష్మినారాయణ మార్గాన వ్యవహరించ గల్గుచున్నందులకు ఆనందము కల్గుచున్నది.

రాష్ట్రీ కాంగ్రెసు పెత్తనం అందినది గదాయని రైతు కాంగ్రెసును చిన్న చూపు చూడరాదని నాబోధ। ఆచరణలో తాను, గొర్రెపాటి రైతు వుద్యమాన్నే బలపరుస్తూ అందుకే కాంగ్రెసులో పెత్తనము. అనేవారు. నడిచేవారు·

కనుకనే, ఆ రోజుల్లో మాకు అందుబాటులో వుండవచ్చు అనిపిస్తూ భిన్న మంత్రివర్గ పెత్తనంలో ఆ వోబుల రెడ్డి, తిమ్మారెడ్డి, యీలచ్చన్న ప్రభృతులను మంత్రులుగా వూహించుకున్నారేగాని, తనకు కూడా ఒక స్థానం కావాలనుకోలేదు. ఆ నాటి లక్ష్మీనారాయణ। చివరి కాలం వరకు మంత్రిపదవులు పొందిన మావారు-తిమ్మారెడ్డి, లచ్చన్న, వోబుల రెడ్డి, రోశయ్య, వెంకట్రావు ప్రభృతులను ఆశీర్వదిస్తూనే వుండిరిగాని, ఆకాశపు దీపాలు అందినవని ఆరాటము జెందలేదు,

అట్టి మానసిక అంతస్తే ఆనాటి పెద్దలందరికి, గాంధీజీ ధోరణిలో మరో సంవత్సరం వరకు అందినట్లైతే పాకిస్థానుకు తెలవొగ్గవలసివచ్చేది కాదేమోనని అంతటి జవహరు లాల్జీయే అనుకొన్నారుగదా.

అప్పుడప్పుడు నేను చూస్తూవుంటిని, ఆనడుస్తూవచ్చే ఆ శూరస్త్రీ యెవ్వరు? బెంగాలీల యెడమ వైపు పల్లెవాటు వేసుకొని, సర సర నడుస్తున్న వారెవ్వరు? దగ్గరకు వస్తూవుండగా పల్చగా, సొగసుగా, చామన చాయతో

పసలగ మీసంతో- అందేవారెవ్వరు? అవును.ఆయనే లక్ష్మి నారాయణ! ఆ మెడ వంచని వారే నా తమ్ములు! అందరు ఆరాటముతో మోకాటిని వంచి, అధికారము కొరకై మనసును మట్టిచేసుకుంటూ వుంటే, అదేమిటి అనిపించగల్గు ధీమాతో వస్తూవున్న వారే నా వద్ద పెరిగి, పెద్దయైన నా ప్రథమ శిష్యులు, అనుచరులు, తోటినాయకులు, నా సోదరులు.

శ్రీ లక్ష్మినారాయణ సంస్మరణ సభ రామసీడు విద్యాలయములో 1981 మార్చి 26 వ తేదీన జరుగుచున్నప్పుడు పలువురు ఆయున యందుండిన ఆత్మ గౌరవము, ధీమాను స్మరించిరి. వొక్కరు కాలేజీ ప్రిన్సిపాలుగా వుండిన వారు, మరొక్కరు విద్యాధికారిగా నిలచినవారు। రెండు సంవత్సరాల పర్యంతం ఆయన్ను యే విధంగానైనా, తమ ధోరణిలో పెత్తనాలు, సంఘ సేవా వ్యాసంగములలో చేర్చుకొనుటకు ప్రయత్నించితిమన్నారు. మందహాసము తోటి వారితో స్నేహముగా వుంటూనే మా ప్రజా సేవామార్గమునుండి లక్ష్మినారాయణ వైదొలుగుటకు అంగీకరించలేదన్నారు. ఆ వివరణ నాకెంతో తృప్తిని కల్గించినది. నాకు వారిగురించి వుంటూవున్న విశ్వాసము బలపడినది. నేను ఎరుగుదు! రాచకీయంగా బలిష్ఠులై, నన్ను, నా అనుచరులను బలవంతంగా వోడించి, రాష్ట్ర రాచకీయాధిపతులైన వారెన్నోసారులు, లక్ష్మినారాయణను తమతో చేరమంటూ వుండిరి, మంత్రి పదవిని యెరగా చూపెట్టిరి,

ఇంచిన గౌరవ, మర్యాదలను తళతళ వారి ముందుంచిరి. ఆ 1930 లో, డిప్యూటీ కలెక్టరుగా సరాసరిగా చేరుటకు నిరాకరించిన లక్ష్మీనారాయణ, నేను రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగా వున్న పంచవర్ష పెత్తనకాలంలో యేది తాను కోరక అందరికి అన్ని మర్యాదలు అందిస్తూ వుండిన లక్ష్మీనారాయణ మన్మందరిని రాజకీయ చదరంగములో ఓడించిన శక్తులు ఇవ్వదలచిన మంత్రి పదవులకు లొంగుతారా? తనతో కలసి వుండి, తన్ను పెద్దగా చూచుకోవలసిన వారు, తన ధర్మ ధోరణిలో వుండలేక, తన్ను మోసగిస్తూ వస్తున్నవారికి యిక ముందు సాయం చేయరాదనుకొనిరి. అందుకే వారు రాజకీయాల నుండి వైదొలిగిరి! ఆ తీర్మానమే భీష్మ ప్రతిజ్ఞయైపోయినది.

అందుకే మంత్రులుగా పలుమారులు పెత్తనాలు చేస్తూ ప్రసిద్ధిగాంచిన వోబుల రెడ్డి, తిమ్మా రెడ్డి, యీనాడు మంత్రులుగా వస్తున్న యువనాయకులు యెంతో ప్రేమ వారిని స్మరిస్తూ ఆసభయందు పాల్గొనిరి. మంత్రిపదవులు ప్రజల సేవించుటకు అవసరమే। ఆ పెత్తనాలను అందుకొనుటకు, ఆత్మగౌరవ ప్రదంగా, నైతికస్థాయిలో, రాజకీయ ప్రచారముచేయుట, విజయముబొందుట అవసరం, మంచిదే! కాని ఆ పదవులకొరకై అన్ని దౌర్భాగ్య ధోరణుల ననుసరిస్తూ, కుట్రపడుట, సోదర సేవకుల హింసించుట, వంచించుట, మరచుటతగదు. ఆ పెత్తనాలకై ప్రజల అవసరాల మరుస్తూ ధార్మిక పంథాను తారుమారు చేస్తూవుండే। అసహ్యావు బాధ

లను భరించుట తగదు। నా అనుయాయుల కట్టి వున్నతే గౌరవ ధోరణియే తగునంటూ వుంటిని। ఆ గాంధేయ పంథాలో నడుస్తూనే లక్ష్మీనారాయణగారు అందరికి ఆదర్శప్రాయులైరి.

స్వతంత్రపార్టీని స్థాపించునప్పుడు. (1951-54) క్రిషికార్ పార్టీని సాగించలేకపోతిమే। డబ్బు లేక, అనుయాయులు క్రమశిక్షణతో వుండక ! తిరిగి మరో పార్టీ పెట్టి యెలా సాగించగలరు అనుకొంటూవుండిరి.

ఐతే, రైతులను ఆ నాటి ప్రధాన మంత్రి జాతీయ ప్రథమ నాయకులు ఆ జవహరులాలు రైతాంగ వ్యవస్థను రూపుమాపాలని, అందరిని సహకార వ్యవసాయమందే చేర్చాలని నాగపూర్ కాంగ్రెసులో ప్రతిజ్ఞ చేసిరే! 1923-33 నుండి యే రైతులను రక్షించుకోవాలనుకొన్నామో అట్టి అశేష వ్యవసాయకుల కాపాడుటకు మార్గము మరొకటేది అనుకున్నారు.

కాంగ్రెసులోనే వుండి పోరాడరాదా అని, ఆయన భారతిదేవితో కలిసి ఆలోచించిరి. పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి పదవికి రాజీనామా పెట్టితిని. అప్పుడు జవహరులాల్ కళ్ళ నీళ్ళు పెట్టుకొనిరేగాని, ఏవేవో పదవులు. పైత్రనాలు అంగీకరించమంటిరేగాని, వుమ్మడి వ్యవసాయపు రైతాంగ వ్యతిరేక ధోరణినే బలపరుస్తూవుండిరిగదా!

సహకార వ్యవసాయ ధోరణిని మనలాగే వ్యతిరేకిస్తున్న శ్రీ చరణసింగు యు. పీ- మంత్రిపదవిని వదలుకొన

డము లేదుగా? శ్రీ సుబ్రహ్మణ్యం ఢిల్లీలోనే మంత్రిగా వుంటున్నారుగా? అలాగా కొందరు ఆలోచిస్తున్నప్పుడు వాళ్ళు పదవులను అంటిపెట్టుకుంటూ వుండేవారు అన్నారు లక్ష్మీనారాయణ.

"పదవులను పొందుతూనే, నెహ్రూవిధానాలను తారుమారు చేయగల సత్తాగాని, దోరణినిగాని మనకు లేదుగాబట్టే రాష్ట్రస్థాయిలో మంత్రిపదవిని అందిస్తామన్నా వద్దంటిమి" అన్నారు భారతీదేవి!

"మన జీవితాదర్శము, గ్రామీణుల స్వంతవుద్యోగ ఆర్థికవిధానమును రక్షించుకోవడం, బహుళమగు రైతులకు అందుచున్న పది, ఐదు, రెండు యెకరాలు భూవసతిని, అందు అందే స్వతంత్ర ఆర్థికస్థాయిని నిల్పుకోవడంగదా? ఆ మన ప్రధాన ధ్యేయంకు ఈ పదవులు వుపయోగించవే? లోకలేవుంటూ ఏమిచేయలేకపోతిమే అంటూ రంగాజీ బాధపడుతూ వుంటారు అదిభరించలేము!" అన్నారు శ్రీ గొర్రెపాటి! "పోనీ, కాంగ్రెసునే వదలమనండి. బైటనే వుందాము. నెహ్రూజీ ప్లానులను యెదిరిస్తూవుందాము" అన్నారు లక్ష్మీనారాయణ. "ఇంత కాలం యిన్ని పెత్తనాలుచేసి, యిప్పుడు యింత నిర్వీర్యమగు, చేతగానితనంగా వుండగలమా?" అన్నాడు పాలెంనాయుడుగారు. "తిరిగి పార్టీపెట్టడమా! పెట్టి పోషించగలమా? నడుపగలమా?" అనిరి దేవీజీ! "కొత్త పార్టీలో చేరేవారు. ఆ కాంగ్రెసులోని వారిమాదిరి వారేగా? ఏదో పదవిచూచి, పారిపోయేవారేగా." లక్ష్మీనారాయణప్రశ్న!

శ్రీ రాజాజీ మనతో చేరితే యెలాగవుంటుందో అన్నా! "ఆయన వొప్పుకుంటారా? జవహరులాల్‌ను బలపరచితిరే, సర్దారును కాదని అన్నిఅధికారాలు అందుకున్నవారు యిప్పుడు మనతో కలసి యెదిరి పక్షములోకి వస్తారా?" అంటూ లక్ష్మీనారాయణ ఆలోచనలో మునిగిరి. దక్షిణాదిన నేను పర్యటనకు వెళ్ళుచున్నా! దేవిజీ నా వెంటవస్తున్నారు. మేమిద్దరం వారిని చూస్తాము. అప్పుడు ఆమెకు కూడా నమ్మకం కల్గితే! "ఋణవిమోచన చట్టం చేసింది వారే! ఈమధ్య మనకు అనుకూలంగా వ్రాస్తున్నారు! కలవండి, చర్చించండి, ఆలోచిద్దాము" అన్నారు లక్ష్మీనారాయణ.

1959 జూన్ నాల్గో తేదీన, మద్రాసులో కీ॥ శే॥ రామచంద్రా రెడ్డి సర్దారు లాల్‌సింగులు, జీవ్‌రాజ్ హెగ్డే సమావేశపరచిన అఖిల భారత రైతాంగ సభలో స్వతంత్ర పార్టీని స్థాపించుటకు రాజాజీ ముందు కొచ్చిరి. ఆ ప్రయత్నాన్ని, తీర్మానాన్ని శ్రీ జయప్రకాష్ ఆశీర్వదించిరి. నన్నే అధ్యక్షులుగా వుండమని, రాజాజీ బలవంత పరచిరి. జయప్రకాష్ ప్రోత్సహించిరి. అప్పటి కప్పుడే అసెంబ్లీ సభ్యులు పాకాల నాయుడు, రాజగోపాల నాయుడు కాంగ్రెసునుండి రాజీనామ చేయుటకు తీర్మానించుకొనిరి. నేను "సరే". నా మాటకు పదిరోజుల వ్యవధి కోరితిని.


అంతకుముందే కాంగ్రెసును వదలి. డెమోక్రటిక్ పార్టీని పెట్టుకొనిరి సర్దారు లచ్చన్న, ఓబులు రెడ్డి, చెన్నారెడ్డి, ప్రభృతులు. ఆప్రయత్నం మంత్రి పదవుల వ్యవహారంలో బైలుదేరిన వివాదముల ఫలితమైనా వారు కూడా స్వతంత్ర పార్టీలో చేరెదరనే ఆశ యూకున్నది. పత్రికలలో ఆ సమాచారాల తెలుసుకొని, "ఇంత తొందరపడిరే! ఎప్పుడూ యీ బాధలే! పోనీలే, రాజాజీ, జయప్రకాష్‌నారాయణ తోడగుచున్నారు" వేయి మార్లు అనుకున్నారట శ్రీ లక్ష్మీనారాయణ. రాజాజీ అందునున్నారుగనుక, "పరవాలేదులే", అన్నారట శ్రీ బుచ్చినాయుడు! "మసానీ గారు కూడా వున్నారు. కనుక పార్టీని భరించుటకు కొంత అండ కలుగ వచ్చునన్నారట కొందరు.

స్థాపించినాము నడిపితిమి 9 సంవత్సరాల పర్యంతం స్వతంత్ర పార్టీని రైతులు, గ్రామీణులు, స్వయం వృత్తుల వారికొరకై, మసాని ప్రభృతులు పారిశ్రామికుల కొరకై, రాజాజీ పౌరసత్వ హక్కులు మధ్యతరగతుల వారి కొరకై. అశోక కోయలిషన్ బృందం.

సాగించితిమి సంవత్సరాలపర్యంతం. 1962 ఎన్నికల్లో ఓడిపోతిని. తిరిగి చిత్తూరులో జనించితిని, ఆ బాధలలో శ్రీ లక్ష్మీనారాయణ యెంతో మానసిక వ్యధ బొందిరి.

1933 లో తానెట్లా ప్రథమ రైతురక్షణ యాత్ర లందు పాల్గొన్నారో అటులే 1964-65లో రైతులకు సీలింగులు లోబడిన భూవసతిని రక్షించుటకై మాతో చేరిరి. శ్రీ లక్ష్మి నారాయణ। పార్టీలో మాత్రం చేరలేదు। ఎప్పటికప్పుడు సలహాలు అందిస్తూ వుండిరి. అదే చాలు నాకు పార్టీ నిర్వహణ భారం శిరసావహించ లేదు. తుదకు సాధించినాము సీలింగులో బడిన రైతాంగ భూస్వామ్యరక్షణ!! ఆ విజయానికి ఆయన సహ కారంతో భారతీ దేవి గొర్రెపాటి ప్రభృతుల సాహసమగు రాచకీయ ప్రయత్నం ద్వారా అందుకున్నాము. అలాగా కోట్లకొలదిగావున్న రైతులు, లక్షలాదిగా యీనాడు వాకొక్క రాష్ట్రములో. కొంగ్రొత్తగా భూమిని కొద్ది కొద్ది మడులు, చేలుగా అందుకొని, భూమిపొందుచున్న, ఆత్మ గౌరవము అనుభవిస్తున్న రైతులు, హరిజనులు, వెనకబడ వుండిన బీదలు, రక్షణ బొందుచున్న రైతాంగ జనాలుగా వెల్లుమన్నారు. ఆస్వాంతవుద్యోగులగు బీదప్రజలను సేవిం చుటలో, రక్షించుటలో మాతో బాటు గాంధేయ సేవ కులుగా శ్రీ లక్ష్మీనారాయణ వుంటూవుండిరి. అదే నా తృప్తి. అందుకే నాకు వారియెడల ప్రేమ, కృతజ్ఞతా భావం.

:— o



నిడుబ్రోలు రామానీడు రైతాంగ విద్యాలయంలో జరిగిన ఒకసభలో ప్రసంగిస్తున్న శ్రీ గోగినేని లక్ష్మినారాయణ, ఇంకా ఆచార్య ఎన్. జి. రంగా, 'సత్యసుధీరత్న' శ్రీ యార్లగడ్డ రంగ నాయకులు హాదరి వున్నారు.

[ఆచార్య రంగాజీ, శ్రీ గోగినేని లక్ష్మీనారాయణల సోదరప్రేమ ఆదర్శప్రాయమైనది. శ్రీ రంగాజీ తమ సోదరునిపట్ల తనకుగల ప్రేమకు చిహ్నంగా "డిస్టింగ్విష్ డ్ఎక్స్ప్రెషన్స్" తన ఆంగ్లగ్రంథం ఒకటి, రెండుభాగాలను శ్రీ లక్ష్మీనారాయణగారికి అంకితమిచ్చారు. మొదటి భాగంలో తనసోదరునిగూర్చి రంగాజీ వ్రాసిన వ్యాసంలో కొంత భాగాన్ని ఈ దిగువ ప్రచురిస్తున్నాము..... ....సం॥]

1925-26 సంవత్సరాలలో నేను రైతుల, రైతు కూలీల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసే సమయంలో శ్రీ లక్ష్మీనారాయణ ఆర్థికశాస్త్రాధ్యయనంలో నా మొదటి విద్యార్థిగా గుంటూరు చుట్టుపక్కల మెట్టప్రాంతాలలో రైతు కూలీల స్థితిగతులను గురించి సమగ్ర నివేదిక తయారుచేసి యిచ్చారు. గ్రామీణ రైతుకూలీలలో అస్పృశ్యతను వారి నికృష్ట సామాజికస్థితిని నిరోధించి ఆర్థికస్థితిని పెంపొందించ డానికి ముఖ్యమైన ఆయుధాలుగా లేబర్ ఎక్స్ఛేంజీలు, తాత్కాలికకూలీ రద్దు పద్ధతి రద్దుచేయడం గ్రామీణ రైతుకూలీలకు భీమాసౌకర్యం కల్పించడం, వయోజన ఓటింగ్ హక్కు ప్రవేశపెట్టడంవంటి విషయాలను గురించి నేను వ్రాసినవ్యాసం ఆంధ్రపత్రిక దినపత్రికలో ప్రచురించ బడింది. అది చదివినతరువాత రైతుసంఘాల, వ్యవసాయ కూలి సంఘాల, ఉద్దేశాలను అర్థంచేసుకొని 1923-27 మధ్యలో కలకత్తా విశ్వవిద్యాలయంలో అధ్యయనంచేసే టప్పుడు ఆచార్య రాధాకమల్ ముఖర్జీ పరిచయంతో ఆయన

వ్రాసిన "Foundations of Indian Economics" అనే గ్రంథం చదివారు. ఆయన పరిచయంతో నా "Economics of Khaddar" 'వ్యవసాయిక పరిశ్రమల ఆవశ్యకత' అనే నా సిద్ధాంతాలతో ఎందరో మేధావులు ఏకీభవిస్తున్న విషయం గ్రహించారు. వీటిని ఆ నాటి ఒకే ఒక భారతీయ ఆర్థికశాస్త్ర సమాచార పత్రిక "Indian Economic journal" లో నా రచనలు ప్రచురింపబడినవి. దానితో భారత వ్యవసాయ ఆర్థిక విషయంలో నా దృక్పథంలో ఆయనకుగల విశ్వాసాన్ని పటిష్ఠంచేసుకున్నారు. ఆరోజుల్లో సోదరులు కీ. శే. శ్రీ గోగినేని వెంకటసుబ్బయ్య (అప్పికట్ల) మద్రాసులో B. A. చదువుతూ, ఆర్థికవిషయాల ఎంక్వయిరీ కమిటీకి నేను కార్యదర్శిగా ఉన్నప్పుడు ఆయన పరిశోధకుడుగానూ, ఆర్థిక శాస్త్రాన్ని అధ్యయనంచేస్తున్న శ్రీ లక్ష్మీనారాయణ, కృష్ణా జిల్లాలో అన్ని వసరులూ కలిగిన రైతులుకూడ నిత్యజీవితావసరాలకు చాలినంత ఆదాయంలేక బాధపడుతున్న విషయాన్ని గుర్తించారు. దీనికి కారణం వీరికి చాలినంత సేద్య భూమిలేకపోవడం; అప్పులు, ఎరువులు, పనిముట్లు, శిస్తులు వగైరా ఖర్చులు మితిమీరిపోవటమే! వీరు మార్కెట్టులో రైతులకష్టాలు, వ్యాపారస్తులు, మిల్లరు విపరీతమైన లాభాలు పొందడం, రైతు అమ్ముకునేధరకు వీరే తిరిగి మార్కెట్ లో కొనేధరకు మధ్య గణనీయమయిన పెరుగుదల ఉండడం శాస్త్రీయంగా సాకల్యంగా పరిశోధించి గ్రహించారు. నా సూచనల మేరకు వీరి అధ్యయనంవల్ల పొందిన పరిజ్ఞానంతో శ్రీ లక్ష్మీనారాయణ శ్రీ జి. వి. సుబ్బయ్యగార్లు "కో-ఆపరే

టివ్ మార్కెటింగ్ ఫెడరేషన్," "కో-ఆపరేటివ్ రైస్
మిల్లింగ్, కో-ఆపరేటివ్ సేల్సొసైటీలు, విస్తరింపజేశారు.
1933 నాటికి వ్యవసాయ ఆర్థికశాస్త్రవేత్తగా విజ్ఞానంపొందిన
శ్రీ లక్ష్మీనారాయణ కాపిటలిస్టుపద్ధతి రైతులకు, రైతుకూలీ
లకు కలుగజేసిన హానినిగూర్చి నేను ప్రచురించిన సిద్ధాం
తాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్నారు. అందువల్ల
ఇతరులు రైతులపై చేస్తున్న దోపిడీనిగురించి ప్రతిదేశభక్తుడు
కూడా అవగాహనచేసుకొని వారిని సమర్థించవలసిన అవస
రము ఇనుమిక్కిలిగా ఉన్నది. వారికి దేశసంపదలోనూ
సామాజికస్థితిలోనూ సరియైన స్థానం కల్పింపబడాలి. గాం
ధేయ సత్యాగ్రహపద్ధతులలో వీరికి న్యాయమయిన వ్యవ
స్థను చేకూర్చడానికి సామూహికంగానూ, తరగతులవారీ
గానూ వీరిని విభజించి వీరికి తగుస్థానాన్ని కల్పించడానికి
ఉద్యమాలు నిర్వహించడంలో శ్రీ లక్ష్మీనారాయణ క్రమ
శిక్షణగల సైనికునిగా ప్రవర్తించారు.

నా రచనలు ఎన్నిటికో ఈయన సంపాదకత్వం వహిం
చారు. ముఖ్యంగా "Kisan Speaks Kisan movement"
'Kisan Hand book' Kisan Mazdoor Praja Raj మొదలైన
రచనలలో వీరి సహాయం మరువరానిది. "అంటరానితనం,
నిరక్షరాస్యత, మతఛాందసత్వం" మొదలైన సాంఘిక దురా
చారాలకు వ్యతిరేకంగా రైతులలో మా ప్రచారానికి ఎంత
గానో తోడ్పడ్డారు. స్వయంఉపాధికల్పనకు కుటీరపరిశ్ర
మలవంటివానిని ఎంతగానో సమర్థించారు.

'ప్రముఖుల సందేశాలు'

# ఆదర్శమూర్తి

శ్రీ గోగినేని వాగేశ్వరరావు                హైదరాబాద్
[చేనేత, జౌళి పరిశ్రమ శాఖ మంత్రి]

సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, అమిత శ్రద్ధానక్తులతో కలకత్తాలో ఒక వైపు ఉన్నత విద్యనభ్యసిస్తూ, వేరొక పక్క సాంఘిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న మహనీయుడు శ్రీ లక్ష్మీనారాయణ గారు. ఆయన ఓ గొప్పవ్యక్తి మాత్రమేకాదు, ఓ విశాల ఉద్యమం కూడా. వాదనాపటిమలో వారికివారే సాటి. తాను నమ్మిన దానికోసం కావలసిన మిత్రులు దూరమైనా తన వ్యక్తిత్వాన్ని చెదరనీయకుండా నిలబెట్టుకొన్న ఆదర్శమూర్తి శ్రీ లక్ష్మీనారాయణ.

ఆయన రాజకీయ జీవితానికి ఆదర్శంవున్నది. స్వేచ్ఛ తన కార్యక్రమానికి పునాదిగా నిలుపుకున్నారు. రైతులు దుర్భర దారిద్రియానికి గురియైవున్న సమయాలలో ఆయన రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు జరిపి సహాయ కార్యక్రమాలు నిర్వహించేవారు. శ్రీ పి. తిమ్మారెడ్డి, శ్రీ కందుల ఓబుల రెడ్డి, శ్రీ గౌతులచ్చన్న, శ్రీ రాజగోపాల్ నాయుడు వంటి వారితో సన్నిహితంగా వుంటూ రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

# ఆశయానికి ఆచరణకి మధ్య అన్వయం

వెల్లంకి చంద్రపాల్ కూచిపూడి
కార్యదర్శి, తెనాలి తాలూకా.
రాష్ట్ర గ్రామీణ ప్రజాసమాఖ్య

వ్యక్తిగత జీవితంలోను, రాజకీయ జీవితంలోను ఆశయానికి ఆచరణకు మధ్య అవిభాజ్యమైన అన్వయంతో మెలగిన మహనీయుడు శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ. ఆచార్య రంగాజీ నడిపిన రైతాంగ ఉద్యమాలకు పెద్ద అండగా చిత్త శుద్ధితో రథానికి ముందు నిలబడి వ్యవహారం సాగించిన ధీరుడు ఆయన. గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కార కృషిలో కృత్రిమత్వాన్ని ఎంతమాత్రం చొరనీయని నిక్కమైన మంచినీలంగా మెలిగారాయన, స్వాతంత్ర్యోద్యమంలో రాత్రింబవళ్ళు రైతు బిడ్డగా కండలుకరిగే కృషి చేశారు శ్రీ లక్ష్మీనారాయణ. గుణగణాలలో, శక్తి సంపదలలో అనిర్వచనీయమైన వ్యక్తిత్వం ఆయనది. హాసం, సాహసం, అతి స్పష్టభాషణం. రాజకీయ సమరోత్సాహం, కల్లాకపటంలేని వ్యక్తిత్వంవంటి విశిష్ట లక్షణాలతో గ్రామీణ రైతాంగహృదయాలలో చెరగనిముద్రగా నిలచిపోయారు శ్రీ లక్ష్మీనారాయణ.

"వాహిని" పత్రిక సంపాదకులుగా స్వాతంత్ర్యోద్యమ కాలంలో రైతులు - కూలీల సమస్యల పరిష్కారానికై, లక్షలాది సామాన్య ప్రజల అభిరుచులకు అనుగుణంగా

ఉన్నత ప్రమాణాలతో పత్రికను తీర్చిదిద్దడానికి శ్రమించారు. కిసాన్ కాంగ్రెస్ కార్యదర్శిగా కీలక పాత్ర నిర్వహించారు శ్రీ లక్ష్మినారాయణ. గుణం లేని రాజకీయాలు అధికారరాజకీయాలని, అధికారానికి నీతినియమాలుపరిధులు కావని, అటంకాలుకావని, భావించి, శ్రీ లక్ష్మినారాయణ అధికార రాజకీయాలకు దూరంగా వుండిపోయారు.

# రైతు హృదయంలో చెరగని ముద్ర

శ్రీ కె. రోశయ్య హైదరాబాద్
(రాష్ట్రరవాణాశాఖమంత్రి)

రాష్ట్ర రాజకీయాల్లో, కర్షకోద్యమాల్లో శ్రీ గోగినేని లక్ష్మినారాయణకు ఆయా అంతస్తుల్లో పాత్రవుంది. ఆయనలోని విశిష్టతల్లోకెల్లా ముఖ్యమయినది నమ్మినదాన్ని గట్టిగా చెప్పటం. ఆయన వ్యక్తిత్వాని కదే జీవగర్ర. ఆచార్య రంగాగారు రైతు ఉద్యమనాయకులుగా విశ్రాంతి లేకుండా 1947 లో రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటిస్తున్నప్పుడు శ్రీ లక్ష్మినారాయణకూడా వారికి అండగా జనాన్ని సమీకరిస్తూ వుండేవారు. శ్రీ లక్ష్మినారాయణగారి వేష, భాషల్లో "రైతు తరహా" స్పష్టంగా కనిపిస్తూవుండేది. శ్రీ లక్ష్మినారాయణ వ్యక్తిత్వం పట్ల గుంటూరుజిల్లాలోని రైతాంగంలో ఎంతో ఆర్ద్రతవుంది. ప్రచారకుడుగా ఆయన నిర్మాణదక్షుడు. స్వాతంత్ర్యోద్యమకాలంలో ఆయనలోని గట్టితనం ప్రతిభా ఔన్నత్యాలు ఎంతటివో వారితో

సన్నిహితంగా మెలగినవారికి తెలుసు. ఆయన రైతు కేంద్రవాదిగా, రైతులోకంలో జీవించారు. కాని ,తడియారని హృదయం గల వాడుగానే రాజకీయరంగం నుండి చాలా కాలం క్రితమే నిష్క్రమించారు. ఇందుకు కారణాలు ఏవైనప్పటికి శ్రీ లక్ష్మినారాయణ నిస్సందేహంగా అత్యంత ప్రతిభా సంపన్నుడు.

## మంచి వ్యక్తిత్వంగల మనిషి

శ్రీ వాగినేని వెంకయ్య — ధేనువకొండ
(మాజీ శాసన సభ్యులు) — ప్రకాశం జిల్లా

గుంటూరు జిల్లా రైతాంగ ఉద్యమాలలో శ్రీ లక్ష్మి నారాయణ నిర్వహించిన పాత్ర సాహసోపేతమైంది. చిర స్మరణీయమైనది. "వట్టిమాటలు కట్టిపెట్టవోయ్ గట్టినే తల పెట్టవోయ్" అన్న సూక్తికి అక్షరాల అన్వయం పొందిన వ్యక్తిత్వం ఆయనది.

## రైతుకూలీ శ్రేయోభిలాషి

శ్రీ పి. రాజగోపాల్ నాయుడు — న్యూఢిల్లీ
(లోక్‌సభ సభ్యులు)

ప్రపంచం మొత్తంమీద కమ్యూనిస్టులేగాక, పెట్టుబడిదారులు, ఇతర వర్గాలవారు రైతాంగాన్ని తమ మనోవాక్షంగా ఉపయోగించుకొని అధికారాన్ని హస్తగతం

గావించుకుని ఆతరువాత వారిని కాలరాచివేస్తారని ఆ రోజుల్లో శ్రీ లక్ష్మీనారాయణ హెచ్చరిస్తూ ఉద్రేకపూరితంగా ప్రసంగించేవారు.

అంతర్జాతీయ రైతాంగ వ్యవస్థను స్థాపించడంలో రంగాగారు ప్రదర్శించిన శక్తి సామర్థ్యాలను ఆ సంస్థకు ఒక సిద్ధాంతాన్ని ఒక కార్యక్రమాన్ని రూపొందించి ఇవ్వటంలో వారుచూపిన దక్షతకు మూవలె శ్రీ లక్ష్మీనారాయణ కూడ ప్రభావితులైనారు. అయితే తాను నమ్మిన విధానాలను వప్పించి అమలుపరచేవరకు పట్టినపట్టు వదిలేవారు కాదు ఆయన. గ్రామీణ పేదరైతాంగప్రాబల్యానికి వ్యతిరేకమైన వర్గాల ఉనికిని శ్రీ లక్ష్మీనారాయణ సహించేవారుకాదు. వారి జీవితానికి ఒక ఆదర్శంవుంది. ఎట్టి క్లిష్ట పరిస్థితులలోను తాను నమ్మిన ఆశయాలను విస్మరించని ధన్యజీవి శ్రీ లక్ష్మీనారాయణ.

## మహావ్యక్తుల్లో ఒకరు

శ్రీగోగినేని సురేంద్రనాథ్ బెనర్జి వరంగల్
ఎం. ఎ. ఎం. బి. ఎ (అమెరికా)

శ్రీ లక్ష్మీనారాయణ గారు మహా నిండైన వ్యక్తి. అచంచల దీక్షతో, నిస్వార్థసేవా పరాయణతో, కార్యదీక్షతో శ్రీ రాముని వెంట అడవులకు పయనించిన లక్ష్మణునిలాగ పయనించారు శ్రీ రంగా గారి వెంట. అగమ్యగోచరమైన ఆ రోజుల్లో స్వాతంత్ర్యము వస్తుందో లేదో

భారతజాతిని బానిసత్వాన్నుంచి విముక్తి చేయగలమో లేదో తెలియని ఆ రోజులలో స్వాతంత్ర్య సముపార్జనకు నడుం కట్టిన మహావ్యక్తుల్లో ఆయన ఒకరు.

పువ్వు పుట్టగానే సుగంధాన్ని విరజిమ్మినట్లుగా విద్యార్థి దశలోనే శ్రీ లక్ష్మీనారాయణ వంశ పారంపర్యమైన సాంఘిక సేవాతత్పరతతో మరో మెట్టు పైకి ఎదిగారు. కలకత్తాలో బెంగాల్ స్టూడెంట్స్ యూనియన్‌కు కార్యదర్శిగా ఎన్నికైనారు. కలకత్తాలో తీవ్రమైన కలరా వ్యాధి వ్యాపించిన సందర్భంలో స్టూడెంట్స్ యూనియన్ తరుపున 'బ్రిగేడ్స్' ఏర్పాటుచేసి వేలాది శవాలతరలింపు సేవాకార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ధాన్యం ఉత్పత్తిదార్ల సమాఖ్య నాయకుడుగా ప్రభుత్వంతో రైతుల తరఫున పోరాడినారు. 1946-51 లో గుంటూరుజిల్లా రాజకీయాల్లో శ్రీ లక్ష్మీనారాయణ గార్ని కామరాజ్ నాడార్ లాగా "కింగ్ మేకర్" అనే వారు.

శ్రీ లక్ష్మీనారాయణ సువిశిత మేధావి. ఏ విషయమునైన కూలంకషంగా ఆలోచించి నిర్ణయము తీసుకొనేవ్యక్తి. స్వాతంత్ర్య సముపార్జనలో రైతు రక్షణ యాత్రల్లో ఉద్యమాల్లో శ్రీ రంగా నాయకత్వంలో సుదీర్ఘంగా కష్టనష్టాలను నిస్వార్ధంగా భరించి పయనించిన నాకు మరపురాని మహావ్యక్తులలో ఒకరు శ్రీ లక్ష్మీనారాయణ. బ్రిటిష్ పాలనలో జైలుకెళ్ళిన శ్రీ లక్ష్మీనారాయణ స్వాతంత్ర్యము

విదేశప్రభుత్వమిచ్చే పదవులను, తామ్రపత్రాల నాశించ లేదు. స్వాతంత్ర్య సమరయోధులకిచ్చే భూముల నాశించ లేదు. నిస్వార్థ రైతుకూలి ప్రజాసేవ కంకితమైన మహా అరుదైన వ్యక్తుల్లో శ్రీ లక్ష్మీనారాయణ ఒకరు.

## రైతుపెద్దకు భాష్పాంజలి

శ్రీ పావులూరి శివరామకృష్ణయ్య
గోవాడ
తెనాలి తాలూకా

జాతీయోద్యమ కాలంనుండి అష్టకష్టాలననుభవించి ప్రజాసేవే పరమార్థంగా భావించి మనందరిని వీడి పోయిన అతిరథ మహారథుల్లో రైతుపెద్ద, స్వాతంత్ర్య సమరయోధులునైన శ్రీ గోగినేని లక్ష్మీనారాయణగారొకరు. రంగాజీచే ప్రారంభించబడిన రైతాంగ విద్యాలయములకు ఒక ప్రక్క మాతృశ్రీ భారతీదేవిగారు, మరొకప్రక్క లక్ష్మీనారాయణ, వెంకటప్పయ్య, నన్నపనేని వెంకట సుబ్బయ్యగార్లు పరిపోషకులై తుష్టిని పుష్టిని చేకూర్చారు.

నేటి రాజకీయవాదులలో అలముకొన్న క్రమశిక్షణా రాహిత్యం, అధికారకాంక్ష, పదవీ వ్యామోహం, ప్రజాసేవయందు అలసత్వం, బంధుప్రీతి మచ్చుకైన వారిలో కన్పించేవి కావు. అధికార పదవులకై అర్రులుచాచక రాజకీయదుస్థితికి పరితపిస్తూ రాజకీయరంగమునుండి వైదొలగటం మనందరికి తెలిసిన విషయమే!

# మరపుకురాని స్మృతులు

శ్రీ వి. యల్. సుందరరావు

[ప్రధాన కార్యదర్శి,
అఖిల భారత స్వాతంత్ర్య
సమరయోధుల సంస్థ]

బాపట్ల
గుంటూరుజిల్లా

శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ గారు నిర్మొహమాటి సమస్యలను ఆకళింపుచేసుకోగల శక్తి సంపన్నులు. చెప్పదలచుకొన్న విషయం స్పష్టంగా క్లుప్తంగా నాలుగు మాటలలో చెప్పగలరు. ఇతరుల బాధలు తన బాధలుగా ఎంచుకొనే వారు. నిశితమైన సలహాలు యివ్వటం ఆయన ప్రత్యేకత. మనసిచ్చి మాట్లాడినట్లే హృదయం విప్పి నవ్వటం ఆయన స్వభావం. నిర్మొహమాటంగా ఆయన యిచ్చే సమాధానాల కారణంగా ఎందరో ఆయన్ని అపార్థం చేసుకొన్నారు.

రంగాజీ జైలులో ఉన్నప్పుడు - రెండవప్రపంచ యుద్ధసమయంలో 1940నుండి1944వరకు శ్రీలక్ష్మీనారాయణ గారు శ్రీమతి భారతీదేవిగారు రాష్ట్రంలో ప్రధానమైన రైతు ఉద్యమాలకి సారథ్యం వహించారు. అప్పుడు మా పోటి కార్యకర్తలకు నాయకులు సహచరులు, సహోదరులు, సంధానకర్తలు, సమస్యలపట్ల ఆయన మనస్సు ఎలాద్రవించేది, ఆ రోజుల్లో చూశాం. రాయలసీమ కరువు, శ్రీకాకుళం జిల్లాలో కరువు కాటకాలు సంభవించినప్పుడు రైతునాయకుడుగా ఆయన హృదయం వెన్నమాదిరి కరిగిపోయినది.

# కర్షక జన కళ్యాణానికి కృషి

శ్రీ హెచ్. ఆర్. శాయోజీరావు పెద్యేగు
[రాష్ట్రగ్రామీణ ప్రజాసమాఖ్య అధ్యక్షులు] కృష్ణాజిల్లా

ఆచార్యరంగాగారు ఏ కార్యక్రమాన్ని సంకల్పించినా నిర్వహణ బాధ్యతను సంతోషంగా తన భుజస్కంధాలపై వేసుకుని కార్యభారాన్ని సమర్థవంతంగా నిర్వహించే దక్షుడు శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ. రైతాంగ సమస్యల పరిష్కారానికి ఆయన ఎంత త్యాగంచేసినారో రంగాగారిని బలపరచే విషయంలో కూడా అంతే త్యాగం చేశారు. వారి సోదర ప్రేమకు విలువకట్టలేము. అందుకే పూజ్యరంగాజీ తాను రచించిన (Distinguished Acquaintances) ఒకటి, రెండు భాగాలను శ్రీ లక్ష్మీనారాయణకు అంకితమిచ్చారు.

రంగా గారు కారాగారజీవితంలో వున్నప్పుడు రైతు ఉద్యమ కార్యకర్తలకు సలహాలిస్తూ ధైర్యంచెబుతూ శ్రీమతి భారతీ దేవికి సహాయకారిగా ఉద్యమాన్ని నడిపేవారు. అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ కార్యదర్శి పదవిని అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు. సామాన్య ప్రజాశ్రేయస్సుకు, కర్షక జన కళ్యాణానికి ప్రతిఫలాపేక్షా రహితంగా సేవజేసి తరించినారు శ్రీ లక్ష్మీనారాయణ.

# లక్ష్యసాధనకు అంకితమైన వ్యక్తి

శ్రీ అవ్వుల సాంబశివరావు
ఉపాధ్యక్షులు, ఆంధ్ర విశ్వకళాపరిషత్ వాల్తేరు

శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ గారి పేరు జ్ఞప్తికి రాగానే, ఆరోజుల్లో ఆచార్య రంగాగారి నేతృత్వం క్రింద సాగిన రైతాంగ ఉద్యమాలు ఒక్కసారిగా కళ్ళముందు మెదలుతాయి. ఈ ఉద్యమాల నిర్వహణలో శ్రీ లక్ష్మీనారాయణ అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి రైతాంగంలో నూతనోత్తేజాన్ని కలిగించారు.

శ్రీ లక్ష్మీనారాయణ స్వయం కృషితో, స్వంత ఆలోచనలతో ప్రజల మధ్య మెలగి ప్రజాజీవితానికి పునాదులు తెలుసుకున్నారు. గ్రామీణ పేదప్రజలకు కష్టంకలిగితే ఆయన హృదయం అగ్నిగోళంగా మారేది. రంగాగారు వేసిన బాటలో పయనించి, వారి ఆశయాల లక్ష్యసాధనకే అంకితమైనారు. గ్రామీణ ప్రజలలో చైతన్యాన్ని, అవగాహనను పెంపొందించేందుకు నిర్మాణాత్మకమైన కృషిచేశారు.

శ్రీ లక్ష్మీనారాయణను గుర్తుపెట్టుకోవడమంటే - ప్రజాహిత జీవనం సాగించడం, సామాజికస్థాయిని పెంచటం. అదేవారికి అసలైన జ్ఞాపక చిహ్నం.

# విప్లవ జ్యోతి

శ్రీ దరువూరి వీరయ్య
జర్నలిస్టు
గుంటూరు.

1947 లో ఆచార్య రంగాగారు, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుని హోదాలో గుంటూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించి, రైతాంగాన్ని మేల్కొల్పే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పర్యటనలో శ్రీయుతులు గోగినేని లక్ష్మీనారాయణ, కందుల ఓబులరెడ్డి, నాగినేని వెంకయ్య, కల్లూరి వీరయ్య, పాతూరి సుబ్బయ్య, బాచిన సుబ్బారావు, వాసిరెడ్డి వెంకయ్య, పేరిన సుబ్బారావుగార్లతో పాటు పాల్గొనే అదృష్టం నాకు కలిగింది. ఆ సందర్భంగా జరిగిన వివిధ బహిరంగసభల్లోను శ్రీ లక్ష్మీనారాయణ ఒక విప్లవ జ్యోతివలె కనిపించారు. అల్లూరి సీతారామరాజును జ్ఞప్తికి తెచ్చారు.

శ్రీ లక్ష్మీనారాయణ అఖిలభారత ధాన్యం ఉత్పత్తిదారుల సంఘాధ్యక్షులుగా రైతులకు సంబంధించి నేటి ప్రభుత్వాలు అమలు జరుపుతున్న, జరపాలనుకుంటున్న వివిధ చర్యలను ఆనాడే ప్రభుత్వానికి సూచించివున్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర లభింపజేసేదానికి, మధ్యదళారుల బారినుండి రైతులను రక్షించేదానికి ఆయన చిత్తశుద్ధితో కృషిచేశారు.

---

## ధైర్య సాహసాలు గల వ్యక్తి

శ్రీ పి. తిమ్మారెడ్డి
(మాజీమంత్రి) హైదరాబాద్

శ్రీ లక్ష్మీనారాయణగారు రాజకీయ రంగంలో నిలబడివున్న దినాల్లో సాగిన ఉద్యమాలకు, నేటి ఉద్యమాలకు ఎంతో వ్యత్యాసం వున్నది. ఆనాటి ఉద్యమాలకు ఒక లక్ష్యం వుండేది. చిత్తశుద్ధి వుండేది. నేడు ఆ ధోరణి కానరాకపోవటం దురదృష్టకరం. రంగాగారు సిద్ధాంతాలు నేర్పుతూ వుండేవారు. వాటిని అవగాహన చేసుకుని, ప్రజలకు నచ్చజెప్పి వారిని ఉద్యమోన్ముఖులు చేసేదానికి శ్రీ లక్ష్మీనారాయణ మేమంతా రాష్ట్రంలో తిరుగుతూ వుండేవారము. నేను లక్ష్మీనారాయణను, ముఖ్యంగా ఆయన ధైర్యసాహసాలను మరువలేను. తానిచ్చిన విధానాలను శాసనరూపంలో అమలు జరిగేవరకు విశ్రమించేవారు కారు. అట్టి మిత్రునిగూర్చి గొప్పగా చెప్పుకోవటం నాకు గర్వకారణం.

## సంస్థల నిర్వహణలో శక్తి సంపన్నుడు

శ్రీ ఆచంట రంగనాయకులు బాపట్ల
అడ్వకేట్

శ్రీ లక్ష్మీనారాయణగారి పేరు తలపునకు రాగానే వెంటనే నిడుబ్రోలులోని రామానీడు విద్యాలయం జ్ఞప్తికి

వస్తుంది. రంగాగారి చేత నిర్వహింపబడ్డ ఆ ఆంధ్ర రైతాంగ విద్యాలయంలో శ్రీ లక్ష్మీనారాయణ తన జీవిత పాఠాలను నేర్చుకుని, ఆ తరువాత పలువురికి గురువులయ్యారు. రంగా గారు జైలు జీవితంలో వున్నప్పుడు రైతాంగ విద్యాలయాన్ని, రైతు ఉద్యమాన్ని శ్రీ లక్ష్మీనారాయణ సమర్థవంతంగా ఎట్లునిర్వహించారో జ్ఞప్తికి తెచ్చుకుంటే, సంస్థల నిర్వహణలో ఆయన ఎంతటి శక్తి సామర్థ్యములు కలిగిన వారో స్పష్టమవుతుంది.

## కాకలు తీరిన కర్షక యోధుడు

'కళా ప్రపూర్ణ'
శ్రీ పాతూరి నాగభూషణం
విజయవాడ

శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ ఆవేదనగల హృది. ఆలోచనగల మనస్సు; ఆచరణకు తమకని కార్యదక్షతగల వ్యక్తి. రంగాగారి శుశ్రూష క్రింద ఎందరో కాకలుతీరిన కర్షక యోధులు తయారైనారు. అట్టివారిలో మేటి ఉద్యమ సంచాలకుడు శ్రీ లక్ష్మీనారాయణ. రంగాగారిలోని కట్టుబాట్లు, భావదీప్తి, అచంచల దీక్షా తత్పరత లక్ష్మీనారాయణ నరనరాలలోకి ప్రాకినవి. శ్రీ లక్ష్మీనారాయణ నిశితమైన విమర్శకులు. గాంభీర్యం, కరకుదనంగల వక్త. కొంత కాలం 'వాహిని' పత్రిక బాధ్యతలు పెట్టుకుని దానిని రైతుల

పత్రికగా తీర్చిదిద్దారు. రైతులకు ఎక్కడ ఎలాంటి అన్యాయము జరిగినాచాలు రంగాగారి కేకవినిపించగానే, నడుం బిగించి రంగంలోకి దూకేవారు శ్రీ లక్ష్మీనారాయణ. ఆయన జీవితాన్నంతాకూడ ఆత్మాభిమానంగల పౌరుషస్వభావంతో ఛేటగడిపారు.

## గ్రామీణ వ్యక్తి

శ్రీమతి అమరేశ్వరి
ఆంధ్ర ప్రదేశ్ హైకోరుజడ్జి హైదరాబాద్

ఆచార్య రంగా గారి ధోరణిలో, గ్రామీణ రంగంలోని సమస్యల్ని సమగ్రంగా ఆకళింపు చేసుకున్న, గ్రామీణ వ్యక్తి శ్రీ లక్ష్మీనారాయణగారు. వారు ఆత్మవిశ్వాసంతో గ్రామీణ ఆర్థిక జీవితాలు మెరుగుపడేందుకు కృషి చేసిరి. రైతులు స్వయం వృత్తుల వారి సమస్యల పరిష్కారానికి అంకితమైరి నిజంగా లక్ష్మీనారాయణ గారు తెలుగు రైతాంగం గర్వించదగిన కార్య దీక్షాపరుడు.

# రామునివెంట లక్ష్మణునివలె

శ్రీ కందుల ఓబుల రెడ్డి
(మాజీ మంత్రి) హైదరాబాద్

స్వాతంత్ర్య సముపార్జనకు పూర్వము, ఆ తరువాత కూడ నేను శ్రీ లక్ష్మినారాయణ సన్నిహితంగా కలిసి పని చేశాము. శ్రీ లక్ష్మినారాయణ గారితో కలిసి కూర్చొని సమస్యలను చర్చిస్తూవుంటే సమయం తెలిసేదికాదు. ఆయన ప్రతి విషయాన్ని లోతుగా పరిశీలించేవారు. రంగాగారు ఎన్ని సంస్థల్ని స్థాపించారు! ఎన్ని ఉద్యమాలు నడిపారు। అన్నిటకూడా రాముని వెంట లక్ష్మణునివలె, రంగాగారికి అండగానిలిచారు. శ్రీలక్ష్మినారాయణ మా అందరికీ ఆదర్శ ప్రాయంగా వ్యవహరించేవారు.

# త్యాగశీలి

శ్రీమతి కంచర్ల కమలాదేవి విజయవాడ

రంగాగారు రైతుసంఘాల్ని దేశవ్యాప్తంగా స్థాపించి రైతులను రక్షించుకునేందుకు, వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రారంభించిన కృషికి, మొదటినుండికూడ

మా చిన్నాన్న శ్రీ లక్ష్మీనారాయణగారు అండగా నిలచారు. అటు బ్రిటీష్ ప్రభుత్వంచేత, ఇటు జాతీయ ప్రభుత్వంచేత రైతు కార్యక్రమాన్ని అంగీకరింప చెయ్యాలన్న లక్ష్యంతో ధైర్యంగా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. గ్రామీణ ప్రజల ఆర్థిక కష్టనిష్టూరాలు ఆకళింపు చేసుకున్నవారు కనుక జనాభాలో నూటికి 75 కు పైగావున్న గ్రామీణ ప్రజల ఆర్థికత చెడకుండా బాగాబాగుపడుతూ, వారికున్న స్వేచ్ఛ చెడకుండావుండగలగాలన్న పట్టుదలతో శ్రీ లక్ష్మీనారాయణ గారు 'స్వయంపోషక వృత్తుల' కు రక్షణకావాలని ఉద్యమం నిర్వహించారు. ఒక మంచిలక్ష్యంతోటి, చిత్తశుద్ధితోటి జీవితాన్ని గడపిన త్యాగశీలి ఆయన.

## ప్రజాహితచర్యలకు అంకితం

డా॥ కె. నరసింహారావు
లెక్చరర్
శ్రీమతి కె. పుష్పకుమారి
లెక్చరర్
శ్రీ వెంకటేశ్వర
విశ్వవిద్యాలయం
తిరుపతి

కొన్ని ఉన్నతమైన ఆశయాలను నమ్ముకుని, జీవితాన్ని వాటికోరకు అంకితం చేసిన ప్రముఖులలో శ్రీ లక్ష్మీనారాయణ గారు ఒకరు. 'దేశ ఆర్థిక వ్యవస్థకు గ్రామాలు పునాది అని, గ్రామాలలో రైతులకు తగిన ప్రోత్సాహం

లేకపోతే ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం కాగలదని' ప్రభుత్వానికి పదే పదే హెచ్చరికలు చేస్తూ రైతులకు అండగా నిలిచారు శ్రీ లక్ష్మీనారాయణ. పూజ్యరంగాజీ శ్రీ లక్ష్మీనారాయణ గారి ప్రజాహిత సేవలను పుస్తక రూపంలో వేయటం ద్వారా ఆనాటి ఉద్యమ స్వరూపాన్ని తిరిగి స్ఫురణకు తెచ్చిన వారయ్యారు.

## 1947 తిమ్మాపురం బహిరంగ సభలో శ్రీ లక్ష్మీనారాయణ

శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ మొదటినుండికూడ రైతాంగ సమస్యల పరిష్కారానికే కృషిచేశారు. ఇందుకు సంబంధించిన తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా ప్రకటించేశారు. 1947 డిశంబరు 30 వ తేదీన తిమ్మాపురం బహిరంగసభలో శ్రీ లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ "పండించుకునేందుకు కొద్దోగొప్పో భూమివుండి వ్యవసాయి పనిముట్లులేక, ఎరువులు విత్తనాలు లభ్యంగాక, పండిన కాస్త పంట అతివృష్టి అనావృష్టిపాలై ప్రభుత్వ సహకారం లేక, భార్యల మెడల్లో పుస్తెలు, వంటసామాగ్రి పెట్టుబడిదారులకు తాకట్టుపెట్టి అత్యంత దుర్భరమైన జీవితాలను వెళ్ళబుచ్చుతున్నారు. నేడు గ్రామాలలోని రైతులు లేవనింగు కంట్రోలువల్ల కేవలం ఉద్యోగులు మాత్రమే లాభాలు పొందుతున్నారు. గ్రామీణ పేదజనాల పాలిటి అది పెనుభూతమైనది. పల్లెగ్రామాలలో ధనవంతులు ఉద్యోగులు రోజురోజుకు కుబేరులుగా తయారవుతుండగా,

గ్రామీణ మధ్యతరగతి రైతాంగం చితికిపోతూంది. బ్రిటిష్ వారినుండి సంక్రమించిన లంచగొండులు, అవినీతి పరుల సలహాలను పాటిస్తే ఈ దేశానికి భవిష్యత్తులో దుర్గతితప్పదు. ఈధోరణిని మనంధైర్యంతో ప్రతి ఘటించాలి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తప్పని రుజువుపరచే దానికి, గాంధీజీ ధోరణిలో అహింసాయుత పద్ధతులతో కట్టుదలతో సత్యాగ్రహము, సహాయనిరాకరణము చేద్దాం. అవసరమైతే కారాగార శిక్షలకు సైతము తయారవుదాము, రైతులుగా గ్రామీణుల హక్కులనుమీరు రక్షించుకోండి", అని గంభీరోపన్యాసం చేశారు. రైతాంగ సమస్యల పట్ల ఆయనకు గల ప్రత్యేక శ్రద్ధకు పైన పేర్కొన్న వారి ఉపన్యాసమే నిదర్శనం. రైతాంగాన్ని ఉద్యమోన్ముఖులుగా చేయటానికి ఆయన తన జీవితాన్నే అంకితంచేశారు.

— — — —

## చిత్తశుద్ధితో రైతుల పక్షాన నిలచాము

(స్వాతంత్ర్య సముపార్జనకు పూర్వము, తరువాత తాను, శ్రీ లక్ష్మీనారాయణ శ్రీమతి భారతిదేవి పదవుల ప్రలోభానికి లొంగక ఏకంగా రైతుల కొరకు పోరాటం సాగించింది ఆచార్య రంగాజీ ఉపన్యాసంలో వివరించారు. — ఎడిటర్)

శ్రీ లక్ష్మీనారాయణ వస్తూ వుంటె, కదులుతూ వుంటే సూరకత్తిలా, అటు యిటు వంపులేకుండా దూసుకుంటూ అందుతున్నారనిపించేది.

మా అమ్మ బంగారుసకు పన్నె లందించే వారట!
మా అక్కయ్య లక్ష్మి బంగారపు బొమ్మ! సూ
ర్యకాంతిని మింగేసేవారు! మా అమ్మకు
"ఉదయింపు సూర్యలు" తళుక్కులందించేవారు
మా తమ్ముడు, తెల్లని ఖద్దరు షర్టు, బెంగాలీ
వారి వల్లెవాటు వుత్తర్యములో
ఉదయాన్న అందుతుంటే, చాందినీ వెన్నెల
సూరకత్తిని మరిపించేవారు!

పాటలు పాడేవారు తమ్ముడు వెంకటసుబ్బయ్యతో కలిపి, ఆ సన్నపనేని ధ్వని యుద్ధాలదూకుడును స్ఫురింప చేసేది. లక్ష్మీనారాయణ అందుకు తళుక్కులందిస్తూ పాడే వారు. ఇద్దరుచేరి, ఉత్సాహపూరిత విజయధ్వానాలను విరజిమ్మేవారు. అందాలకు స్వరాలు అందించేవారు. వుద్యమాలకు వేడిని, వేగమును పెద్దతమ్ములు వెంకటప్పయ్య పూరించేవారు. అట్టిది ఆ త్రిమూర్తుల కదలిక కదలియకా!

నేడు పంజాబు, హర్యానాలలో, ఇందిరాజీ రైతులకు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులవద్ద వున్న ధాన్యాలకు సంబంధించి అచ్చటి ముఖ్యమంత్రులు రైతులకు ప్రబోధిస్తున్నారు. వారు రైతులపై వత్తిడి చేయడంలేదు. ఏమని? తమ గోధుమలను వర్తకులకు యివ్వ వద్దు. ప్రభుత్వపు యఫ్. సి. ఐ. కే యివ్వమని. రక్షణ ధరలకు మాత్రమే కాదు గిట్టింపుధరలకే. ఆ పైన పేరాశతో వర్తకుల మోసాలకు లొంగవద్దని. యెలాగా వచ్చింది

యింత బలం రైతులకు? ప్రభుత్వము యిలాగా యెందుకు రైతులతో సామరస్యంగా వుంటున్నదో ఆలోచించాలి యీనాటి రైతాంగం!

ఆ !930-46 లో బ్రిటిషు ప్రభుత్వం, 1946-52లో భారత ప్రభుత్వం, నిర్బంధ ధాన్య సేకరణ తప్పని ప్రొక్యూరుమెంటు ద్వారా రైతులకు నష్టమైనా తాము నిర్ణయించిన తక్కువ ధరలకు ధాన్యాలను యిచ్చి తీరాలన్నారు. యివ్వనివారు తిండి దొంగలన్నారు. కమ్యూనిస్టుల చేత కూడా అలాగా నిందింపజేశారు. పాతర్లలో, పురులలో కొట్లలో నిల్వచేసుకున్న ధాన్యాలను పట్టుసేవారు పోలీసుల బలగాల సహాయంతో. ఎదిరిస్తే రైతులను జైళ్ళకు పంపేవారు. అందుకు ఆనాటి కాంగ్రెసు మంత్రులు సరేననడానికి తయారయినారు.

## నిర్బంధ ధాన్య సేకరణకు ప్రతిఘటన

రైతులకు గిట్టింపు ధరలివ్వరా? తాము పండించుకున్న ధాన్యాలపై రైతులకు హక్కు లేదా? వుండరాదా? అని గాంధీజీకి వ్రాసిరి శ్రీ లక్ష్మీనారాయణ. బోసుబాబును యీ దుర్మార్గాన్ని యెదిరించ వద్దా అని అడిగిరి.

రెండో ప్రపంచ యుద్ధమువస్తే బ్రిటిషు వారితో జాతీయ కాంగ్రెసు సహాయ నిరాకరణ చేస్తున్నప్పుడు, వారి ధాన్యసేకరణ విధానాన్ని మనము యెదిరించవలసిందేనని గర్జించినారు లక్ష్మీనారాయణ.

బోసుబాబు తీవ్రఘోరణి సత్వర సహాయ నిరాకరణ పంథా, ప్రొహ్యూరుమెంటు విధానం నాపుటకు కూడా వుప యోగమన్నారు లక్ష్మీనారాయణ! ఇది గొప్ప ఆయుధంగా మన వీరుల చేతులలో వుంటుందని బోసుబాబు, లక్ష్మీనారా యణను అభినందించిరి. అందుకు నేను మన మంత్రులచేత అంగీకరింపజేసినా వారి సమావేశములలో. ఐతే వెంటనే యుద్ధవ్యతిరేక సత్యాగ్రహాన్ని ప్రారంభించుటకు బాపూజీ తయారుగాలేరు. వారిని కాదనడానికి నేను తయారుగాలేను! బోసుబాబుతో కమ్యూనిస్టులు, సోషలిస్టులు నడచుటకు తయారుగాలేరు.

ఇన్ని వివాదాలు మామధ్య సాగుచూవుండగా, రైతు లపై నిర్బంధాలు సాగిస్తూనేవున్నారు బ్రిటీషువారు. లక్ష్మీ నారాయణ ముందడుగువేస్తానన్నారు. గాంధీజీ మాటో! అన్నారు కొందరు. రైతుల రక్షించడానికి మనం సాగుదాం! దేశరక్షణకై మహాత్మాజీ దీక్షవహింతురు అన్నారు లక్ష్మీ నారాయణ. అలాగా రణధ్వనుల పూరించిరి. ఆపైన జైలుకు వెళ్ళిరి ఆ 1940 లో.

## జవహర్‌లాల్‌తో వివాదం

స్వరాజ్యావతరణమైన తరువాత కూడా శ్రీ జవహరలాలు, పూర్వపు బ్రిటిషు ధోరణిలోనే వ్యవహా రాలు సాగిస్తూ వుంటే, లక్ష్మీనారాయణ అసంతృప్తి చెందారు. రాష్ట్ర కాంగ్రెసు పత్రనమును మేము అందు

కున్నాం. నేను జాతీయ కాంగ్రెస్ వర్కింగు కమిటీలో సభ్యుడనయ్యాను. మహాత్ముల వద్ద సలహాదారుడను, జవహరు నరసన జాతీయ వ్యవహారాల నిర్ణయించు బాధ్యత శిరసా వహించితిని.

## మంత్రి పదవిని అంగీకరించలేదు

ఈ పెత్తనాలన్నీ రైతుల రక్షించుటకు గాదా! అన్నారు లక్ష్మీనారాయణ. గిట్టింపుధరలు ఇమ్మనండి. రైతాంగం కొనవలసిన ఎరువులు, పరపతి, వస్త్రాలు నూనెలు; సకల ధరలు మండిపోతున్నవి. రైతులు మాత్రం నష్టపడుతూ, తమ ధాన్యాలను ప్రభుత్వానికి అందించాలా? కాదంటే దొంగలమంటారా? జైళ్ళకు నడుపుతారా? మన ఇళ్ళ దొడ్లపై దాడిచేస్తారా అని ఘోషిస్తున్నారు లక్ష్మీనారాయణ.

ఆయనదే సరియైన ధోరణి కనుకనే అఖిలభారత "డీ-కంట్రోలు డే"ను సాగించినాము. ఆపైన జవహరు వుగ్రులైపోయిరి. మహాత్ములవద్ద నా మీద ఫిర్యాదు! గాంధీజీ నన్నే బలపరచిరి. అప్పుడు జవహరు సవాలు చేసిరి. "సరే బస్తీజనాలకు ధాన్యాలు సప్లయిచేస్తూ రైతులకు తగిన ధర లిస్తూ, వ్యవసాయమంత్రిగా రంగాను రమ్మనండి అని గాంధీజీని కోరిరి.

అందుకు నేను సమ్మతించితే, తన సవాలును అందుకుంటే, అవసరమైన నిధులు రైతులకు సహాయంగా ఇచ్చుటకు జవహరులాల్జీ తయారేనా? అని అడిగితిని. ముందు మంత్రిగా రమ్మనండి అన్నారాయన.

అప్పుడు లక్ష్మీనారాయణ, భారతీదేవి, మా పి. సి. పి పెద్దలుతో సంప్రదించుకొన్నాం. ఎందరికో నేను కేంద్ర మంత్రిగా అంగీకరించాలని వున్నది. మనకు యే హామీలు యివ్వకుండా, పదవిని అందుకుంటే ఆ పైన జవహరులాలు నిండుగా బలపరచకపోతే యెట్లాగన్నారు లక్ష్మీనారాయణ. అంతటి మహాత్మునితోనే, చెప్పినా మా సందేహాలు మావి! ముందుతాను గిట్టింపు ధరలు చెల్లిస్తాను! 'నాకు నిర్ణయస్వేచ్ఛ నిస్తాను అని జవహరులు వొప్పకుంటె, రైతులను 'తిండి దొంగలుగా చూడను' అంటే నేను మంత్రి పదవిని అంగీకరిస్తానన్నా. ఇలాగా మా చర్చలు జరుగుచూ వుండినవి అన్నిట కొండంత బలంగా లక్ష్మీనారాయణ నా కప్పుడు వుండినారు. ఎందరో వలె ఆయన మంత్రి పదవి అంటే ఆరాటపడరుగదా! తుదకు మహాత్ముని అనుమతితో, మంత్రి పదవిని అంగీకరించకుండా వుండగలిగితిమి.

## లక్ష్మీనారాయణ ఇంటిపై దాడి

జవహర్ లాల్ జీతో ఏకీభవించని, అవకాశం చూచుకొని రాష్ట్రస్థాయిలో కాంగ్రెసు మంత్రులే మాపై దాడికి తయారైరి నన్ను బలహీనపరచాలంటే లక్ష్మీనారాయణ గారిని లొంగదీసుకోవాలనుకున్నారు. కనుక వారి యింటిపై దాడి చేయించిరి. కొట్టు తాళాలు బద్దలు కొట్టించిరి ధాన్యాన్ని కొల్చి బస్తాలలోచేర్చి తాహశీలుదాకు ఆఫీసుకు చేర్చిరి. అదంతా లక్ష్మీనారాయణ యింటిలో లేనప్పుడే!

ఇంటికి చేరగా యీ దారుణపు, అధర్మపు, నిర్బంధపు దాడిని గమనించి వుగ్రుడైనాడు లక్ష్మీనారాయణ! వెం

టనే కలెక్టరువద్దకు వెళ్ళిరి. తాను యెంతసరుకు, ప్రొక్యూరుమెంటుకు యెన్ని బస్తాలివ్వాలని తనకు నోటీసు లిచ్చారో చూపిరి.

అంతకు మించే తాను, భారతీదేవి, సోదరులు వెంకటప్పయ్య ప్రభుత్వమునకు ముస్ముందుగానే అందించిన బస్తాల లెక్కలు, రసీదులు చూపెట్టిరి. ఆలాంటప్పుడు వుద్యోగస్థులు, పోలీసులు అలాగ తన యింటిపైననే అంత దాడిచేస్తే ఇకసాధారణ రైతులగతియేమి? అనిసవాలుచేసిరి. కలెక్టరుపై పరువు నష్టపు దావా ప్రభుత్వముపై దావా యెందులకు వేయరాదు ? అంటూ నిలదీసి అడిగిరి, తానొక ప్రసిద్ధ చురుకైన లాయరుగడా! ఆ పైన స్వాతంత్ర సమర యోధుడు. రాష్ట్ర కాంగ్రెసు నాయకులుగదా। అట్టి నా సోదరుని ధాటికి కలెక్టరు, తట్టుకోగలరా? తమ తప్పవొప్పుకున్నారు, క్షమాపణ చెప్పుకున్నారు. ప్రభుత్వ లారీల మీద. ఆ ధాన్యాన్న తిరిగి "నాగా గార్డెన్సు"కు పంపించిరి ఆ వృత్తాంతమంతా మహాత్ములు స్వర్గారోహణము పిమ్మట అప్పటినుండి కాంగ్రెసు మంత్రివర్గముపై గొర్రెపాటి, భారతీదేవి, వెంకట సుబ్బయ్య, లక్ష్మీనారాయణ గొప్ప శాంతియుత యుద్ధాన్ని సాగించిరి.

ఇహ వూహించుకోవలసింది యీ నాటి వారు! ఎలాగా, ఎన్నాళ్ళు ఎంత పాక్షిక మైన, అధర్మమైన, కక్ష సాధింపు వ్యవహారాలు ఆ నాటి కాంగ్రెసు మంత్రులు, లక్ష్మీనారాయాణ, నాయకత్వము పై సాగించిరో !

రాష్ట్ర కాంగ్రెసు పెత్తనముల నుండి తన్ను వోబులరెడ్డి, తిమ్మారెడ్డిని, జాతీయ కాంగ్రెసు నుండి నన్ను తొలగించాలనే కుట్రలు 1951 వరకు సాగించుతూనే వచ్చిరి ఆనాటి కొందరు మంత్రులు. "ఆ నాటి రైతాంగ వ్యతిరేక మంత్రి కూటములు ధర్మాన్నే వంచిరి." అన్నారు లక్ష్మీనారాయణ!

బంజరు భూముల కొరకు లక్ష్మీనారాయణ లొంగలేదు. అందుకే, మా ప్రక్క చేరివున్న' స్వాతంత్ర్యసమర యోధులలో చీలికలు కల్గించుటకు గాను వారిలో వొక్కొక్కరికి ఐదు ఎకరాలు మాగాణి, లేక పది ఎకరాల మెట్టభూమి యిస్తాము! అని ఆనాటి పెత్తందారులు ముందుకు వచ్చిరి! దానిలోని కుటిలరాజకీయరహస్యాన్ని గ్రహించినాము. మా సలహా పాటించగల్గిన వారందరికీ ఆ కుట్రకు లొంబడవద్దు! భూములు సంపాదించుకోడానికి ఆనాటి రెవిన్యూమంత్రులు, కలెక్టర్లు, తహశ్శీలుదార్ల వద్దకు పిటిషనులు, పెట్టుకొని చేతులు ముడుచుకొని, రాజకీయంగా లొంగవద్దు! వాటంతట అవిగా స్వాతంత్ర్యసమర యోధులకు సన్మానాలు, సహాయాలు వచ్చే రోజులు వస్తాయన్నారు" లక్ష్మీనారాయణ. వోబులరెడ్డి, భారతీదేవి. అయినా ఎందరో "మా హామీలపై నిల్వలేకపోయిరి. లక్ష్మీనారాయణ మాత్రము నిలబడినారు. భారతీదేవిగాని, తాను గాని, నేనుగాని, ఆ భూములకు ఆరాటపడలేదు. ఆపైన మా ధోరణి ప్రకారం, ప్రభుత్వపు బంజరు భూములన్నీ, భూస్వామ్యము పొందలేక తరతరాలుగా భూమిపై కృషిచేస్తున్న హరిజన వెనుకబడిన

జాతుల కూలీలకే చెందవలెనుగదా? అధర్మాన్నే 1923 నుండి మేము ప్రచారము చేస్తూవుంటిమే! కనుకనే, నేను, భారతీదేవి, లక్ష్మీనారాయణ ఆనాటి కొందరు మంత్రుల కుటిల రాజనీతిని ధిక్కరించితిమి. అలాగా బంజరుభూములపై మాకు మంత్రులు ఏర్పరచే హక్కును నిరాకరించగల్గితిమి.

— — — —

# తలపోత

రచన : శ్రీ తుమ్మల సీతారామమూర్తి

శ్రీ లక్ష్మీనారాయణా!
ఏమెలా నశరీరయాత్ర నిస్సీ! యనంగం
జాలితివి బంధుమిత్రుల
ఆలుబిడ్డల యెడంద లలముటఁ జిక్కన్?

ఔను! నీతప్పు లేదులే! దాన ధర్మ
సత్య సౌహార్ద స్రమతా! శౌచకోచి
రుజ్జ్వలం బగువేళ నీ వుద్భవించి
యెదిగితివి సాధుశీల సంపదలతోడ.

తెల్లవాని నెదిరితివి సబర్మతి యతి
యిడిన హేతితో నహింస తోడ
నరకకల్పమైన చెఱసాల నిల్చితి
వలరుఁదోఁట నిల్చినట్లు వలఁతి!

పదవులకు చదువు లమ్మక
పదుగురికై లెస్స గాసిపడితివి ; ప్రజ్ఞా
నిధి యంగీకృత జనతా
భ్యుదయుఁడు రంగాకుఁ దగిన సోదరుఁడవుగన్

గాడిదలకు గుఱ్ఱములకు
తేడా కన్పింపనట్టి దినముల, సిరియే
ఱేఁడగు దినముల బ్రతుకుట
కూడదని తలంచి చేరుకొంటివి పరమున్.

అటఁ గన్పించిన బాపూ
పటేలులకు నేఁటి కుటిల భారతకథ తె
ల్పుటకుం బూనకు, మందలు
పటుశాంతిం గనుఁడు తత్త్వపరతంత్రమతిన్.

మా గోడవలు చిరకాలము
సాగవులే ! సమసమాజ సంక్రాంతిమయా
భాగము మేర్పడుచున్నది
రాఁగల దీక్ష ఫలము నిన్నరాచిన కృషికిన్.

# కల్లకపట మెఱుఁగని ఉల్లమున ఉల్లాసపు జీవితమున్ —

"సత్య సుధీరత్న"
శ్రీ యార్లగడ్డ రంగనాయకులు చౌదరి
(కార్యదర్శి, వై. ఎన్. ఒ. హైస్కూల్)
కారంచేడు
ప్రకాశంజిల్లా

లక్ష్మీనారాయణ లక్ష్మీపుత్రుడా ? కాదు
సామాన్యపు రైతు – రైతుజన మాన్యుడు
ఆచార్య రంగా అనుంగు సోదరుడు – అయిన
సామాన్యుడే !


విద్యాధికుడయ్యు – వినయశీలుడు
భేషజములు డంబము లెరుగని – సద్గుణ భూషణుడు
వ్యసనరహితుడు – హితవచనుడు
అధికారముల కర్రుచాచని ధీరుడు
అధికారపు జాడ్యములంటని ధీశాలి
అందులకే మాన్యుల ప్రశంసలందుకొను మనీషి
నిండు జీవితంబు నిశ్శబ్దముగ గడపి వెడలె
గుణవతి అర్ధాంగి – తత్తుల్యులు పుత్రికలేవురు
క్షమ సంయమనముల రహింతురుగాక – భర్తృ పితృ
న్యాయమునన్

అనుబంధం

# గోగినేనివారి ఆడుబిడ్డలు

శ్రీ లక్ష్మీనారాయణగారి భార్య శ్రీమతి సత్యవతీదేవి గుంటూరు సమీపమున గల ఉప్పలపాడు మునసబు గారి కుమార్తె!

వారికి ఐదుగురు కుమార్తెలు, ప్రథమ కుమార్తె శ్రీమతి ఇందిరాదేవి ఆమె, రైతు కాంగ్రెసు నాయకులు, జూపూడి రైతు శ్రీ వెంకటసుబ్బయ్య కుమారుడు శ్రీ మెట్ల రామమోహన్ రావు బి. ఎస్ సి, బి. యల్. ను వివాహమాడిరి. రెండవ అమ్మాయి శ్రీమతి కమలాదేవి ఆమె భర్త శ్రీ మల్లాది రాధాకృష్ణమూర్తి యమ్. ఎ, నైవేలీ ప్రాజెక్టులో డిప్యూటీ టెక్నికల్ ఇంజనీరుగా రిటైరైరి. వీరిది నడింకల్లి. మూడవకుమార్తె శ్రీమతి అనిలాదేవి, బి.ఎ. ఆమె శ్రీ కంచర్ల మధుసూధన రావు యమ్. బి. ఎ. [యు.ఎస్.ఎ] భార్య. ఆయన సుప్రసిద్ధ ఆత్మగౌరవోద్యమ ఆంధ్రనాయకులు కీ॥ శే॥ కోవెలమూడి గోపాల కృష్ణయ్య (ప్లీడరు) మనుమలు. వీరి స్వగ్రామం కృష్ణా జిల్లా కోలవెన్ను. నాల్గవ అమ్మాయి శ్రీమతి నిర్మలాదేవి. అప్పికట్ల రైతు ప్రముఖులు రంగాజీ మేనల్లుడు శ్రీ ఆచంట మాధవ రావుగారి కుమారుడు శ్రీ ఆచంట సుభాష్‌చంద్రబోసును వివాహమాడిరి. ఆయన హైదరాబాదులో, చురుకైన



కుటుంబసభ్యులతో శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ [వివరములు చివరి పేజీలో]

లాయరుగా పనిచేసిరి. వీరు 1978లో గుండెజబ్బుతో దివం గతులైరి. ఆయన అక్కయ్యే యీనాటి ఆంధ్ర హైకోర్టు జడ్జి శ్రీమతి అమరేశ్వరి! ఐదో కుమార్తె శ్రీమతి ఉషాదేవి. ఎం. ఎ; చీరాల కాలేజీ లెక్చరరుగా, కెనడాలో, రీసర్చ రుగా వ్యవహరించిన శ్రీ తాళ్ళూరి వెంకటేశ్వర రావు ఎం. ఎస్ సి. ని, వివాహమాడిరి. ఇప్పుడు గుంటూరులో టుబాకో రీసర్చరుగా వుంటూవున్నారు.

ఈ అమ్మాయిలందరు, తాము "గోగినేని సిష్టర్సు లేక, గోగినేనివారి ఆడుబిడ్డలము" అంటూ రంగాజీకి, వారి సోదరులు వెంకటప్పయ్యకు, లక్ష్మీనారాయణగార్లకు, ఆప్తులగుచున్నారు. వీరందరికి పెద్ద. వెంకటప్పయ్య గారి ఏకైక పుత్రిక శ్రీమతి కంచర్ల కమలాదేవి. ఆమెనే, రంగాజీ తమతల్లిని స్మరించుకొంటూ, అచ్చమాంబ అంటూ పిలుస్తూ వుండుదు.

ఈ ఆర్గురు ఆడుబిడ్డలు, వారి కుటుంబ సభ్యులందరు. శ్రీ సత్యసాయిబాబా అనుచరులై భక్త సమాజ, ప్రార్థన లలో వుందురు.

"గోగినేని" పదానికి, పర్యాయ పదములు గంగినేని, గంగానేని వారు, వీరంతా కాకతీయ నాయకుల సాంప్ర దాయమువారు. ఆ పదునాల్గో శతాబ్దములో, కాకతీయ ప్రతాపరుద్రుని పాలన జడిపోగా, ఖిల్జీసుల్తానుల పరాయి పాలనం దక్షిణ భారత దేశముపై వచ్చిపడినది. ఆ పరాయి పాలనాన్ని శ్రీ ప్రోలయ, కాపయ నాయకుల అధ్యక్షుల

సామర్థ్యము ద్వారా ఎదిరించి, వోడించి, తొలగించి, తిరిగి భారత దక్షిణ భారతీయ స్వతంత్ర పాలనాన్ని సాధించిన, వీరప్రతాపులు, కాకతీయ నాయకులు, వారి వంశీకులు, యిప్పటికీ కమ్మ, రెడ్డి, తెలగ, ఆది వెలమ, పద్మ వెలమ, వెలమ కొప్పుల, వెలమ తెలగలు, మున్నూరు కాపులు, ముత్రాసులు, ముదిరాజులు, చెంచులు, బోయ శెట్టిబలిజులు, గాజుల శెట్టి, కుంకుమ శెట్టి, కొండ రెడ్డి పులగపు రెడ్డి, హరిజన వగైరా వివిధ రైతాంగ శాఖలలో ఆయా కాలాల అదృష్ట ముల ననుసరించి వివిధ గ్రామీణ వృత్తులలో శైవ, వైష్ణవ, శాక్తేయ, స్మార్త, హైందవులుగా జీవిస్తున్నారు. వీరందరూ ఆనాటి కాకతీయస్వాతంత్ర్య వీరనాయకులనే సంస్మరించుకుంటున్నారు. ప్రతి సంవత్సరం వీర పూజలు ప్రతి యింటిలోను సాముదాయకంగా జరుపుకుంటున్నారు.

ఈ గాంధేయ యుగమందు రంగాజీ, లక్ష్మీనారాయణ, వెంకటప్పయ్య సోదరులు ఆనాటి కాకతీయ నాయకుల వలెనే భారత స్వాతంత్ర్య సమరమందు వీరోచిత పాత్రసాగించిరి. రైతాంగ రక్షణోద్యమమును నిర్మించిరి వారి వంగడమునకు గంగానాయకుని వంశమునకు చెందిన వారమని శ్రీలక్ష్మీనారాయణ సుపుత్రికలు దేశభక్తి ప్రపూరితులై తాము కాకతీయ నాయక స్రవంతిలోని ఆణిముత్యాలమను కోవడం శ్లాఘనీయమేగదా। - సంపాదకుడు

o—o

# ద్వితీయ భాగం

## రైతు పెద్ద

# శ్రీ ఆచంట నాగయ్య

ఆచార్య ఎన్. జి. రంగా

రైతాంగ వుద్యమమునకు జీవితాన్నంతా అంకితంచేసుకున్న యోధులలో, రాష్ట్రస్థాయిలో శ్రీగొర్రెపాటి వెంకటసుబ్బయ్యను ప్రథములుగా శ్రీమతి భారతీదేవి గుర్తించి, గౌరవిస్తూవుండేవారు. జిల్లాస్థాయిలో ఆ గౌరవస్థానము శ్రీ ఆచంట నాగయ్యకు అందినది. రైతుల రక్షించడానికై ఆనాటి 1932, 34, 35, 36, 37, 38, 39 రైతురక్షణయాత్రలను దేవిజీ, నేను, సోదరులు వెంకటప్పయ్య, లక్ష్మీనారాయణ, వెంకటసుబ్బయ్య ద్వయం సాగిస్తూవుంటే పోలీసులు, జైలుశిక్షల బాధలు ఎన్నో వెంటాడుచున్నా నిర్భయంగా ముందు నడుస్తూవుండేవారు నాగయ్య. నన్నపనేని రైతుభజనావళినుండి వెల్లెత్తి ప్రదేశులై పాడుతూ, యాడుతూ వ్యవహర్తలను వూపేస్తూ వుండేవారు. తనకు సంగీతధోరణి లేకున్నా, పూవులతో, అడుగులో అడుగువేస్తూ వస్తూ వుండే వీరులు నాగయ్య! "నాగళ్ళు పైకెత్తి కొడవలటువిటు త్రిప్పి పరుగెడుతూ వస్తూంటే ఎమ్మెవరు ఆపగలరోయ్" అనేవారు. క్రమంగా అందుకునేవారు ఆయనసరసన-ఆకాశమెత్తుండే భీమబలుడు కల్లూరి వీరయ్యగారు, వెండితెలతో కల్నాటి వెంకయ్య, గురువారెడ్డి, హరిజన వెంకటేశ్వర్లు, రేపల్లె బెన్న, వెంకటసుబ్బయ్య! సత్తెనపల్లి రత్నస్వామి, వీరయ్య, ఒంగోలు పాపయ్య, వాసిరెడ్డినాయుడు, నాగళ్ళ కృష్ణయ్య మరెందరో యోధులు.

ఆనాగయ్య చూపులకు అందడు. అందాల అద్దాలలో కన్పడడు కేకలున్నచోట ఆయన రణరాణువలు వినపడవు.

కాని, అగ్నిశిఖలలో పెద్దజ్వాల ఆయనదే! మంత్రాంగ స్థాయిలో ప్రథమపలుకు వారిదే. కలెక్టర్ల వద్ద, మేమునడుపుచున్న, సభలో, రైతు,గ్రామీణుల అవసరాలను వివరించడంలో ఆయనేపెద్ద! అధికారులకు వారిమాట యందెంతో గౌరవము. ఆ నాగయ్య రైతులకువొకకుడిభుజం ఆ నలభైసంవత్సరాలనాడు! ఆనాటినుండి శ్రీ నాగయ్యఆదర్శ రైతుసేవకులుగా వెల్గుతూవస్తూవున్నారు. తమతల్లితమచిన్నతనముందే స్వర్గీయులైరి. తన చెల్లెమ్మ ఆదెమ్మను కాకుమాను మునసబునకు వివాహముచేసిరి. ఆమెబిడ్డడు గొప్ప తెలివితేటలు కల్గిన చి॥ భుజంగరావును నా ప్రోత్సాహముమీద, ఇంజనీరింగు ట్రైనింగుకు పంపిరి. ఇంజనీరుగా తయారైన పిమ్మట స్వతంత్రజీవితముపై గొప్పడిజైనింగు యింజనీయరుగా ముందుకు పోవుగుటకు ప్రోత్సహించిరి.

## ఎందరినో తీర్చిదిద్దారు


తన పెద్ద కుమారుడు శేషతల్ప శాయి యింజనీయరైనారు. ప్రభుత్వోద్యోగియే. రెండవ కుమారుడు సాంబశివరావు బి. ఇ; మరొక్కరు శ్రీ మాధవరావును డాక్టరుగా ప్రోత్సహించిరి. మాకందరికీ ప్రియపాత్రులు ప్రముఖ ప్రజాసేవకులు శ్రీ కందిమళ్ళ బుచ్చయ్య కుమార్తెను కోడలుగాఆహ్వానించుకొనిరి. నాసలహాపై ఆయనను ప్రభుత్వోద్యోగానికి పంపక కాకుమానులోనే ఐదుసంవత్సరాలపర్యంతం ప్రైవేటుప్రాక్టీసు చేయించిరి. తండ్రి నాగయ్య, మామ శ్రీ బుచ్చయ్య ప్రోత్సాహంతోను గ్రామీణుల సేవించిరి.

ఆ గ్రామస్థులకు గౌరవనీయులైన నాగయ్యగారి సహకారంతో శ్రీ రావు, అచ్చటి యువకులు, అభినవతిక్కన తుమ్మల శీతారామమూర్తి కవీంద్రుని 1967 లో సన్మానించుకొనిరి. తమ గ్రామమునే వారి కవితాపీఠముగా యేర్పరచుకొనిరి. ఇప్పుడాయన జాంబియా దేశంలో డాక్టరుగావున్నారు. అల్లుడొకరు అప్పికట్లలోనే తామందరు చేరి పెంచిన హైస్కూలులో టీచరుగా వున్నారు. ఇంకెందరో బంధువులను తీర్చిదిద్దారు. వారి వివాహములు ప్రజాహిత జీవితాలు, తన పెద్దతనము ననుసరించే జరుగుతున్నవి. వారందరు ఎచ్చట ఏ వ్యాసంగములలోనున్న మేమున్న రైతాంగ సేవకై అంకితమై వుంటున్నారు. నాగయ్యగారి మేనల్లుడు మాతమ్ములలో నొకరైన శ్రీ గోగినేని వెంకటసుబ్బయ్యను బి. ఏ. (ఈతేరు) జిల్లా బోర్డుమెంబరుగా పెంచిరి. ఆ సభ్యత్వమునకు శ్రీ నాగయ్యనే పిల్చితిమి, కాని మా సుబ్బయ్య చదువరి, యోగ్యులు. ఖర్చులుభరించగలరన్నారు. క్రమంగా వెంకటసుబ్బయ్య ఆదర్శప్రాయులైన అభివృద్ధి కాములైన అధ్యక్షులుగా యెన్నుకోబడిరి. జిల్లాబోర్డు అందు కాంగ్రెసు ప్రతిష్టను పెంచిరి, ఎన్నో గ్రామాలలో స్కూల్సు స్థాపించిరి. ఆస్పత్రులు పెట్టిరి. రోడ్లు నిర్మించిరి. అందుకు నాగయ్య ఎంతో తృప్తిజెందిరి. అలాగా తన సోదరసేవకుల పెంచి వారి పెత్తనాన్నిబలపరచి వారు సాధించునిర్మాణకార్యక్రమాలను జూచి ఆనందించు వారెందరున్నారు యీ రోజుల్లో!

గ్రామీణుల అభిమాని మా మేనల్లుడు లాయరు శ్రీ రంగనాయకులు 1942 లో జైలునకు మాతోబాటు

డెటిన్యూలుగా పంపబడిరి. అందులకు నాగయ్య ఆనందపడిరి. అపిమ్మట రంగనాయకులు గొప్ప లాయరుగా కీర్తినందుటకు ప్రోత్సహించిరి. బాపట్లలో కాలేజీని పెంచుటలో, అప్పికట్లలో విద్యాలయాలనునిర్వహించుటలో, కోపరేటివుసొసైటీలను స్థాపించుటలో శ్రీనాగయ్య పాత్ర ప్రముఖమే. గ్రామ తాలూకా జిల్లాస్థాయిలో నిస్వార్థులైన సాంఘిక సేవకులెలాగా ఆదర్శప్రాయులుగా వుండాలో ఆయన నిరూపించుచునే వుండిరి.

ఆ అప్పికట్లయందే, మా అక్కయ్య శ్రీమతి లక్ష్మిదేవి తన మనుమరాలు, యీనాటికి హైకోర్టు జడ్జిగా వెల్గుచున్న శ్రీమతి అమరేశ్వరిని తమస్థానిక హైస్కూలులో చదివించి పెద్దజేయగల్గిరి. వారి గ్రామం అప్పికట్లకు, బ్రాహ్మణేతర వుద్యమము ఆత్మగౌరవోద్యమముగా మార్పుజెందుసమయాల్లో కీలకపాత్ర వున్నది. బాలకవులుగా ఆనాడుండి, యీనాటికి ప్రముఖ సినీగేయాల రచయితలుగా పెరిగిన శ్రీ కోసరాజు రాఘవయ్య, కుర్రా వెంకటసుబ్బయ్య. 1918 లో కీ॥ శే॥ కొవెలమూడి గోపాలకృష్ణయ్యను, శతావధాని, ఆత్మగౌరవ ఉద్యమ నిర్మాత శ్రీ త్రిపురనేని రామస్వామి (బారిస్టరు)ను పిలుచుకొనిరి. సభజరిపిరి. ప్రజలుప్రమోదించిరి. ఆ కుర్రా సుబ్బారావు ఆ గ్రామపు ముఖద్వారముందుసర్వమానవ సౌభ్రాతృత ప్రబోధించిన బుద్ధభగవానునిశిలావిగ్రహాన్ని ప్రతిష్ఠించగల్గిరి. కవులు రామమూర్తి భాగవతారు, టీచరు సుబ్బారావు అచ్చటనే నాగయ్య ప్రోత్సాహము బొందుచుండెడివారు.



శ్రీ ఆచంట నాగయ్య, ఆచార్య రంగాజీ, శ్రీమతి భారతీదేవి.

త
చూ
హ
వ్రా
మా
అ
బా
లు
రిస్తు
యు

అత
నా
ఆయ
వివి
వద్ద
గారి
పు
వాల
11)

## మధుర స్మృతులు

నాగయ్య చివరి రోజుల్లో వారి మేనల్లుడు చురుకైన యింజనీయరు శ్రీ భుజంగరావు ఢిల్లీకివచ్చి అడిగినారు రెండుసార్లు. "మీరు అప్పికట్ల వెళ్ళాలి. నాగయ్యగారిని చూడాలి" అని; యెలాగయ్యా! నాకంతటి ప్రేమ పాత్రుడు నా కంటె పెద్ద చూస్తానే దుఃఖిస్తుంటాడట ఓర్చుకోగలనా? అంటున్నా, "ఏమైనాపోయిరావాలి. వారిని చూడాలి." అయితే దుఃఖించ వద్దని చెప్పగలవా! అన్నా. అదెట్లా? ఎవ్వరిని తలుచుకున్నా, చూచినా దుఃఖిస్తావుంటారు! "ఐనా మీరు పోయిరావాలి! మీ కొరకే నిల్చివుంటున్నారు. మేము, యెప్పరముపోయినా, మీగురించే కలవరిస్తూ, వుంటున్నారు" అన్నాడు నా ప్రేమ పాత్రుడైన ఆ యువకుడు!

నాపైన నాగయ్యకెంత ప్రాణము! నాకు వారిపైన అత్యంత ప్రేమ! ఐతే, దుఃఖించే అంతటి నా బాల్యమిత్రుని నా పెద్దను చూచుకోనగలనా? నాదుఃఖాన్ని ఆపుకోగలనా? ఆయన్ను చూచుకోకుండగా యెలాగవుండగలను! మనస్సు కుదిలపరచుకున్నా! మార్చి 28 సాయంత్రానికి ఆయన వద్దకు, మాకిద్దరికీ ముఖ్యులైన ఆ కందిమళ్ళ బుచ్చయ్య గారిని తోడుచేసుకొని చేరినా! ఒక గంట వారితో వున్నా! వుండగలిగినా! దుఃఖాన్ని ఆపుకోగలిగినా! ఎన్నెన్నో అనుభవాలు సుఖమైనవీ ప్రజాసేవలో మేమిద్దరం పంచుకున్నవీ,

విలువైన పరస్పర సహకార భాగ్యముతో సాధించిన విజయాలే! నామనసులోకివస్తూ మెదలుచున్నవి.

కొన్నిటిని వివరిస్తూవుంటిని. అంతటి బాధలోవున్నా, నా మిత్రులు నాగయ్య ఎట్లకో కొంతగా మందహాసము అందుకుంటున్నారు. "ఆ గడ్డి వామివైన, ఆ సాయంత్రపు సూర్యుడు దిగుచున్నప్పుడు ఆ గడ్డి అంతా బంగారంగా మారిపోతుంటే, ఆభాగ్యానికి మాచదువుల భాగ్యాన్ని చేర్చుచుంటిమే" అన్నా. ఆ పుస్తకాలు,ఆపాటలు,పద్యాలు ఆ చేల మధ్య తిరుగాడుచున్న ఆ నాటి రైతుల మాటలు మేము యిద్దరం చవిచూచినామన్నా శ్రీ బుచ్చయ్యతో. తలవూపినారు నాగయ్య. మేమిద్దరం మా అమ్మమ్మల వద్దనే పెరిగితిమి. మమ్ముకన్న తల్లులు మా చిన్న తనమందే స్వర్గియులైరి వారి తండ్రితిరిగి పెండ్లాడారు. మా నాన్న తిరిగి పెండ్లి చేసుకోలేదు. ఐనా మాతృ్రడుల రక్షణలో మేము లేము.

## రైతు కూలీ ఉద్యమాలు

శ్రీ నాగయ్యకు తెలుగులో అంత ప్రవేశంలేదు. నేను తెలుగు కావ్యాలు, కథల వరకు బాగా చదువుకున్నా శ్రీ ఆంజనేయులు వద్ద. ఆయనకుయింగ్లీషులో ప్రావీణ్యంవుంది. నాకు ఆయన యింగ్లీషు నేర్పుతుండేవారు. నేను ఆయనకు తెలుగు నేర్పేవాడిని! అలాగా మేమిద్దరం వొకరికి వొకరం విద్యార్థులం సహాధ్యాయులం. మేమిద్దరం ఒకే పర్యాయం

మెట్రిక్యులేషన్ ప్యాసయినాం. ఐతే ఆయన పెద్ద చదువులు మానినారు. నేను ఆక్సుఫర్డుకు చేరినా.

నేను స్వదేశానికి వచ్చేసరికి పెద్ద చదువుల మనిషిగా మిగతావారంతా నన్ను ఆహ్వానించారు. శ్రీ నాగయ్య నా భావాలతో అప్పటికే నా ఉత్తరాల ద్వారా పరిచయం పొందిరి గనుక నాతో పాటు రైతులు, కూలీలకు సేవచేయడానికి ముందడుగు వేస్తానన్నారు. రైతు సభ జరుపుదామన్నారు శ్రీ నాగయ్య. కూలీల సభో అన్నా నేను. మీరు కూలీల సభ మీ వూళ్ళో నడపండి. మా వాళ్ళు రైతుల సభకు వుత్సాహులన్నారు. అలాగా ప్రప్రథమ నవభారతీయ రైతులసభ అప్పికట్లలో, ప్రప్రథమ కూలీల సభ నిడుబ్రోలులో సాగించినాము ఆ 1923 లో. వారిసభ నిండుగా జయప్రదమైనది. మా సభసగంలో ఆందోళన జెందినది.

ఈ విధంగా నవభారత రైతు ఉద్యమానికి ప్రారంభోత్సవం అప్పికట్లలో ఆ 1923లో చేసిరిగదా। దానికి నాంది స్వర్గీయ నాగయ్యగారు. ఈ విధంగా ఆనాటి స్మృతులు నేను జ్ఞప్తికి తెస్తూవుంటే, ఆ యెండిపోయిన నాగయ్య, మాటలకు బదులు, తమయింటికి తూర్పున స్థాపించిన ప్రథమ రైతాంగ సభను గుర్తింపు చేయు శిలా శాసనం వైపు తన హస్తాన్ని కొంచెంగా త్రిప్పుచున్నారు. అక్కడే గదా మీరన్నదన్నారు వారి అల్లుడు. 'ఆ' అన్నారు నాగయ్య. ఆ అప్పికట్ల గ్రామంలో రాజాజీ చేత ఆశాసనాన్ని అగ్ర రైతాంగోద్యమ నాయకుల ప్రథమ విజయ విగ్రహాన్ని స్థాపింప జేసిన ఘనత యీ నాగయ్యదే అన్నా.

ఏదో చెప్పాలనుకున్నారు. మాటలకంటె ముందు ఆనంద భాష్పాలొక ప్రక్క, నడుము నుండి కాళ్ళ వరకు బిగింపువల్ల బాధితులైన దుఃఖము మరొక ప్రక్క వారిలో కన్పించినాయి. నాకిక మాట పల్కు శక్తి సాగలేదు. వారి గడ్డాన్ని అందుకొన్న, తలను సవరించినా, ఫాలాన్ని చుంబు కున్నా.

## కమ్యూనిస్టులకు ప్రతిఘటన

సహకారోద్యమమందు మా యిద్దరికి 1920 లోనే విశ్వాస మేర్పడినది. 1924 నుండి 1955 వరకు గుంటూరు జిల్లాలో సహకారోద్యమమునకు ప్రధాన ప్రబోధకులుగా నాగయ్య వ్యవహరించిరి. జిల్లా సహకార మార్కెటింగు ఫెడరేషను ద్వారా రైతుల పంటలను అమ్మించడంలో మా తమ్ముడు శ్రీ లక్ష్మీనారాయణ, వెంకటసుబ్బయ్యలతో కలసి కృషిచేసిరి. కాని 1959 లో జవహరులాల్జీ సహకార వ్యవ సాయక్షేత్రాలు యేర్పరచి రైతులందరినీ కూలీలుగామార్చు టకై ప్రభుత్వ శక్తుల ప్రయోగించాలని తీర్మానించిరి. స్వంత వ్యవసాయం ఉద్యోగాన్ని దిగమింగి ఆర్థిక దాస్య పిశాచాన్ని ప్రయోగించు ఆనాటికాంగ్రెసు కార్యక్రమాన్ని 40 సంవత్సరాల పర్యంతం సహకారోద్యమ నాయకులైన నాగయ్య నాతో చేరి జవహరు ధోరణిని యెదిరించిరి. కాంగ్రెసును వదలిరి. నాతో స్వతంత్ర పార్టీలో చేరిరి. అధికారాలకు దూరమైరి.

ఎందరో శ్రీ నాగయ్యను మా సోదరులనుండి రాచ కీయంగా వేరుపరచాలనుకున్నారు. మేము కాంగ్రెసు నాయకులతో విభేదించినది. రైతాంగరక్షణ కొరకేగదా అన్నారు నాగయ్య. తిరిగి 1955 లో కాంగ్రెసుతో సహకరించితిమి. రైతాంగము స్వంత పుద్యోగమును భూస్వామ్యమునుండి వేరుచేయాలనుకొనే కమ్యూనిస్టులనుండి గ్రామీణుల రక్షించడానికే నన్నారు నాగయ్య. తిరిగి ఆకమ్యూనిస్టుల ధోరణిలోనే రైతాంగ భూస్వామ్యమును రద్దుజేయు, సహకార సముదాయ వ్యవసాయంకొరకై జవహరులాల్జీ పట్టుదల చేస్తేదాన్నెదిరించడానికి మేముస్వతంత్రపార్టీస స్థాపించితిమి. అది ధనికవర్గాల చేతుల్లో పడుతుందేమోనన్నారు కొందరు. ఆభయం వుండవచ్చునన్నారు మాతమ్ములొకరు. "ఆభయం మనకెందుకు? జవహర్‌లాల్జీనే ధిక్కరించగల్గు మనరంగాజీ బలగాలు కోటీశ్వరుల నెదిరించలేమా? ముందీ గండాన్ని తప్పుకోవాలి. అందుకు రంగాజీబాటే మనబాట" అన్నారు నాగయ్య. అలాగ సహకార వ్యవసాయపుభయం పోగొట్టినాము, రైతాంగ వ్యవస్థనురద్దుచేయబూని ప్రయోగించిన 17 వ రాజ్యాంగచట్టము సవరణనుండి రైతులను రక్షించుకున్నాము. ఇంకెందుకీ స్వతంత్రపార్టీ? బస్సీల కోటీశ్వరులపై ఆధారపడడం దేనికన్నాము. ఏ వర్గాల శ్రేయస్సు కొరకు ఎవ్వరి మధ్య మేము తిరుగాడుచుంటిమో, ఆ రైతుకూలీలు అత్యంతవుత్సాహులై ఇందిరాజీని బలపరుస్తూవుంటే ఆమెద్వారా గ్రామీణుల సేవించడం

సులభము, శుభం అనే తీర్మానానికి నేను వచ్చినాను. తాను నా వెంటనే వున్నానన్నారు నాగయ్య.

క్రిందటి ఆ రెండు సంవత్సరాలనుండి వృద్ధాప్యపు బాధల్లో వుంటున్నారు. ఐనా నేను నిడుబ్రోలు బాపట్ల గుంటూరు లేక విజయవాడ చేరితినని తెలిసిన ఏదో సభలో వుండబోతున్నానని చదివిరా కర్ర బుచ్చుకొని వచ్చి తీరేవారు! ఎందుకింత శ్రమ అంటూ; వీలు చూచుకొని నేనే రానా మిమ్ము చూచుకొనడానికి అంటూ వుండేవాడిని. సభకోసరం అని యొక పర్యాయం, మీకెంతో పని వ్యాకులం నేనే రావడం సులభంగాదా! అనేవారు అంతటి ప్రేమ నాపై. నా రాజకీయ జీవితంలో ఎన్నెన్నో కష్టాలు, అశాభంగాలు స్వశక్తియాలద్వారా మోసాలను యెదుర్కొంటూ యుంటిమి. నాకాయా సమయాలలో శ్రీమతి భారతీదేవి యెంతనైతిక బలము కల్గించే వారో నాగయ్య, తాను మా తమ్ములను మరెందరో సన్నిహితులను నాకు తోడు నీడలుగా చేర్చుతూ వుండేవారు?

ఎన్ని సారులు యెన్నికలలో మేము రాచకీయ యుద్ధాలు సాగించితిమో క్రిందటి 60 సంవత్సరాలలో అన్నిట తన వంతుగా కొన్ని ప్రాంతాల్లో ప్రచారబాధ్యత తాను నిర్వహించుకొనే వారు. తన నాల్గు గ్రామాలు అప్పికట్లలో ఈతేరు, భర్తిపూడి, గుడిపూడి. మరెన్నో గ్రామాలవారిని కలుపుకొని పల్లెల్లో ప్రతిరైతు కూలీ పెద్దలను ఒకచోట చేర్చుకొని రైతుకూలీల ఉద్యమాల ఆశయా

లను వివరించేవారు, పన్నెందుకు అందరు బలపరచాలో వివరించేవారు శ్రీ నాగయ్య. తన బృందాలకయ్యే ఖర్చులకు తానే బాధ్యత తీసుకునేవారు. పార్టీనిధి నుండి యేది యెప్పుడు అడిగేవారే కాదు. వారిని చూచి మరెన్ని కేంద్రాలవారో—గొల్లపూడి, గోవాడ, రేపల్లె వగైరాలు తమ స్వంత వసూళ్ళు, చందాలతో వచ్చేవారు అలాగా ఆ చివరికుప్పం, యీ చివరి పొందూరు, రాళ్ళల్లో యేరుల్లో రాత్రింబవళ్ళు శ్రమించే ఆ యినుములాంటి నాగయ్యతో చిన్నమనిషిగా వున్నానేఅన్నా. అందిన ఆనందం ఆ మాటలతో అదృశ్యమగుచున్నది. మాటలు నాకు సాగలేదు. యెంతటి నేర్పరి! అంతకు మించిన వోర్పు! ఆపైన కన్పించని గాంభీర్యం ఆయన సొత్తు! కనుకనే ఎప్పుడూ యేదో తగాదా మీద కత్తులకంటె కరుకైన వ్యవహారాలు సాగిస్తూ వుండే ఆ పరిసర గ్రామ పెద్దలు యువకులకంటె పెద్రుళ్లై వ్యాజ్యాలు సాగిస్తూ వుండే అందరికి కావలసిన పెద్దగానే సలహాదారుగానే జీవించిరిగదా!


## శ్రీ చరణ్ సింగ్ వ్యవహారం

అడుగుచుండేవారు మరెందరివలెనో "ఆ చరణ్‌సింగు గారు అప్పుడు సహకార వ్యవసాయంద్వారా ఆర్థికంగా స్వయంగా స్వతంత్రులైన రైతులను పంచాయతీ పెద్దల క్రింద, సహకార సంఘాల పెత్తందారుల క్రింద పూడిగం చేయాలని నెహ్రూజీ పథకం ప్రయోగించుచున్నవు డేమి

చేశారండీ! మనమంతా తిరుగబడితిమి! తానేమో మంత్రి పదవుల్లోనే వుండిరే। అన్నారు శ్రీ నాగయ్య.

రాచకీయపు అరణ్యవాసం మనకా? ఆయనమాత్రం మంత్రి పదవుల్లోనా! అనేవారు. మంత్రి పదవుల్లోనేవుంటూ "నెహ్రూనే బలపరుస్తూ పల్లెత్తుమాట రైతుల తరపున పల్కనివారో" అంటే! "నిజమే యిలాంటి వారికంటె ఆయన కొంచం మేలే!" అన్నారు. అయితే 78సంవత్సరాలు నిండిన మీరు ఆ యు.పి. చెరకుఉత్పత్తి దారుల రక్షణకై రాజన్నతో చేరి మార్చి చేసిరే! అలా చేయబోతున్నామని ముందే చెప్పిరిగదా. ఆ మరునాడు, ఆయనకు చెందిన రాష్ట్ర ప్రభుత్వమేగదా, పోలీసులచేత, మీ యిద్దరిని లాఠీలచే బాధించినది. అదియేమి న్యాయమండీ" అన్నారు. మేము "ఫలానా" అని పోలీసులకు తెలియదులే" అంటే! ఐనా, పార్లమెంటులో. అలాగా మిమ్ము కొట్టనేలేదన వచ్చునా? ఆఖరకు అంతటి దారుణ దాడి మీపై జరిగినందులకు విచారము తెలుపద్దూ! అధికారము లోవుంటే అన్ని ధర్మాలు మరుస్తారా? యింతకూ అంతవయస్సున్న మీరు యిట్టి ఆలోచనలేని వ్యక్తుల వలల్లో చిక్కుకోవచ్చునా? బ్రతికి వుంటేగదా, సేవాకార్యాలను సాగించగల్గేది అని బాధపడేవారు శ్రీ నాగయ్య.

శ్రీ చరణసింగు, టైమ్సు ఆఫ్ యిండియా పత్రికలో రైతాంగ అవసరాలనుగురించి తన ఆలోచనలు తెల్పిరి. సంతోష పడుతూ, నాగయ్య నన్ను అడిగినారు. యీ



శ్రీ ఆచంట నాగయ్య, వీరి భార్య శ్రీమతి నాగరత్నమ్మ.

ఆల
నం
భా
అం

వ్య
మిల
రత
చే[illegible]
లున
తమ
ప్ర[illegible]

దిగ
వల్ప
రల
ఆవి
తమ
లన్న
ప్ర

1[illegible]

ఆలోచనలు ఇంకా మించినవి, క్రిందటి నలభై సంవత్సరాల నుండి మనము ప్రచారము చేస్తున్న వే! అయితే ఆయన భారత ప్రభుత్వంలో, హోం మంత్రిగా వున్నారు గనుక అంత ప్రచారం అందినది అదోకమే లే!

"కాని, తాను, యూ. పిలో, ముఖ్యమంత్రిగా వున్నప్పుడైనా అజ్ఞాతవాసంలో వుండిన మనకు యేమైనా బలమిచ్చినారా? అప్పుడే మన పార్టీలో చేరితే, యెంత బలం రైతులకు అందేది! కాంగ్రెసేతర ముఖ్యమంత్రులకు వేరే పార్టీ యెందుకు? మనతో చేరకూడదా? మనం అధికారంలో చేరమనే గదా అన్నారు శ్రీ నాగయ్య. ముఖ్యమంత్రిగా వున్నప్పుడు యీ ఆలోచనలు అందుతాయా అన్నాడు తమ్ముడు వెంకటప్పయ్యా, ఇప్పటికైనా రైతుల పక్షాన ధైర్యంగా ముందుకు రావటం మనకు తృప్తి" అన్నా నేను.

మరో మారు వచ్చిరి నా వద్దకు శ్రీ నాగయ్య నెమ్మదిగా అడిగినారు. "శ్రీ చరణ్ సింగును ప్రధానమంత్రిగా, నిల్పితే మంచిదేనని మీరు కూడా యిందిరాజీకి సలహా చెప్పిరట గదా!" ఔను. కాని, ఆ యోఘను అక్రమ ధోరణిలో, ఆమెపై కసితిర్చుకోవడమే ప్రథమ కర్తవ్యముగు కొంటూ, తనకంతటి అసాధారణ అవకాశం యివ్వదలచుకొన్నా, యిస్తూ వున్న ఇందిరాజీకి ధన్యవాదములైనా తెలుపలేదు. ఆమె పూలమాలతో వేచివుంటే తానే కబురు పంపినా, వారిని

కలుసుకోకుండా, వారి యింటిమీదుగానే కావాలని వెళ్ళి పోతిరే! ఆ మొకున్న యితరసలహాదారులు ఇందుకు ఆగ్రహించరా అంటిని.

అధికారం మాత్రం కావాలి। అందులకై రైతులనైనా మరువగలరు। కాని తన క్రోధం, అహంకారం అణచుకోలేరు. అహంరు, ద్వేషం అమెపై కూడదని గ్రహించని సమోహనులా! అనిరి నాగయ్య. "మంచిదేనండీ మీరాయన్న రైతాంగముకొరకు అనే భ్రమలో కనికరించిరే గాని, ఆయన గొప్ప బుద్ధియేదండీ" అన్నారు. 'మహాభారత' ధర్మములను, మహాకవి తుమ్మల వారివద్ద అనువతము చర్చించుకొనును నాగయ్యగారు। అలాగా, మేము మా తలపులను వడపోసుకుంటూ వుండేవారము.

నాకు అత్యంత ప్రేమపాత్రులైన శ్రీ నాగయ్యను ఆయన చివరి రోజులలో చూచుకోగలిగితినన్న తృప్తి నాకు మిగిలింది. నా రాకకొరకే ప్రాణాలను నిలుపుకొంటూ, నన్ను చూచుకున్న పిదపనే ఆ ఏప్రిల్ 8 వ తేదీన శ్రీ నాగయ్య తృప్తిగా కన్నుమూశారు. ఆయన అకళంక దేశభక్తునిగా, స్నేహశీలిగా ఎందరి హృదయాలలోనో చోటు సంపాదించుకున్నారు. రైతుల సమైక్యతకు గ్రామాల అభివృద్ధికి ఆయన తపస్సుచేశారు. అట్టి పుణ్యాత్ముడు పరమపదించినా ! మంచి మనిషిగా మనందరి హృదయాలలో నిలచియేవుందురు.

# నాగయ్య స్మృతి

రచన

"తెలుగులెంక"

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

విదియ జాబిల్లి రేకల వేయిమార్లు
కనెడి భాగ్యము దక్కె నాగయ్య! నీకు
ఎన్నఁదగు నాయు విది యైన నిన్నువంటి
లోకసేవకునకు నల్పమే కదయ్య!

సంతత ప్రజాసేవలో స్రగ్గు వారు
పరులసుఖ మాత్మసుఖముగా నరయు వారు
దవ్వగుట యోర్వఁజాలదు ధర; నిరంత
రాయురారోగ్యములు వారి కాసచేయు.

కర్షక ప్రజావికాసంబు దేశంబు
నుద్ధరించు నన్నబుద్ధితోడ
నిన్న మొన్న గాదు నీ వర్వదేఁడుల
నాఁడె! నడుముగట్టి నలఁగి తౌర!

అచటనచట భవాదృశు లబ్బుకతనఁ
గడలుకొన్నది! రైతు రంగా మహాత్త
విశ్వకర్షకనేతగా! విమలశీల
దాతగా నుతులందె! నుదాత్తుఁ డితఁడు.

ఈసజ్జన చూడామణి
నీ సేవానిష్ఠ! నీమనీష నిజోప
న్యాసమ్మున మును మెచ్చక
యేసభ నేసీమఁ బల్కె నితరాంశములన్?

బడియైన బాటయైనను
నడిసన్న కళాతపస్విసత్కృతి యైనన్
బొడమినదా! నీవు కడుం
గడు వేసటపడక యప్పికట్ల పురానన్!

అప్పికట్ల యనిన నాచంట నాగయ్య
మదికివచ్చు నెల్లమండలముల
మఱవలేరు నిన్ను మానవుల్ తెమ్మెర
వీచుదనుక మల్లె పూచుదనుక.

# ధన్య మూర్తి

శ్రీమతి గోగినేని భారతీదేవి

అప్పికట్ల
బాపట్లతాలూకా

ఉన్నతమైన ఆదర్శాలు గల మహావ్యక్తిగా మా నాన్న శ్రీ ఆచంట నాగయ్య గారు నా హృదయంలో చెరగని ముద్రగా నిలిచిపోయారు. మా నాన్నగారి ప్రేమ పూర్వక పలకరింపులే, వారికీర్తి, ప్రతిష్టలే మా ఆస్తిగా భావించుకున్నాం. నాగయ్యగారి అమ్మాయినని చెప్పుకునే దానికి నాకు, మా కుటుంబసభ్యులకు ఎంతో గర్వంగా వుంటుంది. తాను గౌరవప్రదమైన విద్య పొందటమేగాక, తన చుట్టుఉన్న ప్రజలకు తన బంధువులకు విద్యను ప్రసాదించారు. ప్రోత్సహించారు.

బ్రతికినన్నాళ్ళు పూజ్యరంగాజీని తన ప్రాణానికి ప్రాణంగా హృదయంలో నిలుపుకున్నారు. మంచంలోవున్న ఒకటిన్నర సంవత్సరకాలంలో రంగాగారిని చూడవలెనన్న కోర్కతో పరితపించిరి. చివరి నాలుగుమాసాలు పొన్నూరు అమెరికన్ హాస్పిటల్‌లో ఉన్నప్పుడు రంగాగారు వస్తే చాలు. నేను వెంటనే లేచి కూర్చోగలను. నా జబ్బు తగ్గిపోతుంది. అనేవారు. మరికొంతకాలం గడచాక రంగాగారిని చూస్తేగాని నాప్రాణం పోదు. ఆయన దర్శనభాగ్యంకొరకే ఈ దేహం ఇంకా ఉంది. అనేవారు. ఒక్కొ పర్యాయం

రంగా గారు వచ్చేప్పటికి నేను ఏపరిస్థితిలో ఉంటానో, నేను మాట్లాడగలనో లేదో? అనుకునేవారు. అంతటి ప్రేమ వ్యక్తంచేసే వారు రంగా గారి పట్ల, ఎట్టకేలకు తన మనస్సులోని కోరిక ప్రకారం రంగాగారిని చూచిన తరువాతనే తనువు చాలించిన ధన్య మూర్తి మా నాన్న.

సహృదయులైన మాతండ్రిగారు అనారోగ్యంతో వున్న ఒకటిన్నర సంవత్సర కాలంలో వారిని సేవించుకునే అదృష్టం నాకు కలిగింది. ఆయనలేని మా ఇల్లు కళావిహీనమే. పూజ్య రంగాజీ తన అమృత హస్తంతో నిండైన మనస్సుతో మా నాన్నగారి ప్రజాహిత సేవలను అక్షర రూపంలో వెల్లడించటం మా కుటుంబానికి ఎంతో ఆనందం. రంగా గారికి మాధన్యవాదాలు.

# ఆదర్శప్రాయులు శ్రీ నాగయ్య

శ్రీ ఆచంట నాగయ్యగారిది ఉన్నతమైన ఆలోచనలు గల వ్యక్తిత్వం. చదువు సంస్కారం గల దిట్ట. వ్యక్తికి విద్య ఎంతప్రధానమో ఆచరణ రీత్యా రుజువు పరచినారు. తన బంధువులందరికి ఉన్నత విద్యలు చెప్పించినారు.

శ్రీ నాగయ్యగారు తమ బంధువర్గంలోని శ్రీమతి నాగరత్నమ్మగారిని వివాహమాడిరి. వీరి పెద్దకుమారుడు శ్రీ శేషతల్పశాయి, హైదరాబాద్‌లో ఇంజనీర్ గా వుం

డిరి. వీరి భార్య సునీతా దేవి. రెండవకుమారుడు శ్రీ ఆచంట సాంబశివరావు (ఇంజనీరు). వీరు శ్రీమతిసుశీలా దేవిని వివాహ మాడిరి. మూడవకుమారుడు శ్రీ ఆచంట మాధవరావు. వీరు జాంబియాలో డాక్టరుగా వుండిరి. సత్యవతీదేవి వీరి శ్రీమతి. శ్రీ నాగయ్యగారి పెద్దకుమార్తె శ్రీమతి సరస్వతి భర్త శ్రీ లక్ష్మీనారాయణ. ద్వితీయకుమార్తె శ్రీమతి భారతీదేవి శ్రీ గోగినేని వెంకట్రాయుడును వివాహమాడిరి. శ్రీనాగయ్య గారి చివరిరోజుల్లో ఈమె దగ్గరుండి సేవలుచేసిరి. శ్రీ నాగయ్యగారి దూరపుబంధువు శ్రీ మన్నె సుబ్బారావుకూడ తన శక్తికొలది శ్రీ నాగయ్యను సేవించిరి.

శ్రీ నాగయ్యగారు తన కుమారులనేగాక, తన మను మలను, మనుమరాండ్రనుకూడా గొప్పచదువులకు ప్రోత్సా హమిచ్చారు.

అప్పికట్ల ఆ చుట్టు పట్ల గ్రామాల అభివృద్ధికి, రైతు లను సమైక్య పరచి ఏకత్రాటిపై నడిపించే దానికి శ్రీ నాగయ్య నిర్విరామ కృషి చేశారు. గ్రామ పంచాయతీ అధ్యక్షులుగా, సహకార బ్యాంక్ అధ్యక్షులుగా జిల్లా బోర్డు సభ్యులుగా శ్రీ నాగయ్యగారు నిర్మాణాత్మక సేవలు చేశారు. నిత్యావసర వస్తువులను కంట్రోలు ధరలకు పేదలకు పంపిణీచేయటంలో ప్రత్యేక కృషి చేశారు. అప్పికట్లలో జిల్లాపరిషత్ హైస్కూలు ఏర్పాటుకుగాను। తన వంతు సహాయ సంపత్తులను అందించారు. అంతేకాకుండా కాకు మాను, నర్సాపాలెం, కంకటపాలెం, పూండ్ల తదితర

గ్రామాలలో కూడ విద్యా సౌకర్యాలు ఏర్పడే దానికి నిర్మాణాత్మకమైన ప్రోత్సాహమిచ్చిన ధన్యజీవి.

శ్రీ నాగయ్య గారు అప్పికట్లలో హరిజన హాస్టల్ ఏర్పాటుకు సహకరించి పేదల మన్ననలకు పాత్రులయ్యారు. ఆచార్య రంగాజీ నిర్వహించిన ప్రతి అభ్యుదయకర ఉద్యమంతోటి శ్రీ నాగయ్య గారికి సన్నిహిత సంబంధం వున్నది. ఆ రోజుల్లో రంగాజీ నేతృత్వంలో నిర్వహించబడిన మొదటి ప్రపంచ కర్షక మహాసభ దిగ్విజయం వెనుక శ్రీ నాగయ్య గారి కృషి నిబిడీకృతమైవున్నది. — సంపాదకుడు

:o—c:



## 72 వ, పేజి తరువాయి ఇవ్వబడిన పటములో వున్నవారి వివరములు :

శ్రీ లక్ష్మినారాయణగారి ఐదవ అల్లుడు శ్రీ తాళ్ళూరి వెంకటేశ్వరరావు కెనడా పోవు సందర్భంగా తీసిన ఫోటో

ఇందులో కూర్చున్నవారు వరుసగా ఎడమనుండి కుడికి పుష్పావతి [లక్ష్మీనారాయణగారి మరదలు], చిరంజీవి లక్ష్మి, శ్రీ లక్ష్మీనారాయణగారు, చిరంజీవి శ్రీధర్, శ్రీమతి సత్యవతీదేవి (లక్ష్మీనారాయణగారి భార్య)

నిల్చున్నవారు ఎడమనుండి కుడికి, శ్రీఆచంట సుభాస్ చంద్రబోసు [లక్ష్మీనారాయణగారి నాల్గవ అల్లుడు] వీరి సతీమణి నిర్మలాబోసు, లక్ష్మీనారాయణగారి ఐదవకుమార్తె తాళ్ళూరి ఉషాదేవి, ఈమెభర్త శ్రీ తాళ్ళూరి వెంకటేశ్వర రావు వున్నారు.

## తెలుగుల వెలుగు

ఇంగ్లీషులో ఆచార్య రంగాగారి పాండిత్యం అఖండమైనది. అలాగే తెలుగు రచయితగా కూడ రంగాజీ తెలుగుల వెలుగే! తెలుగు దేశం ప్రతిభోపేతమైన అనేకులైన రచయితల్ని కన్నది. ఉత్తమ రచనా సంపదకు తెలుగునాడు పురిటిగడ్డ. చాలామంది కన్న రంగాజీ గణ్యమైన రచయిత! అనేక ఉద్గ్రంథాలతో రంగాజీకి పరిచయముంది. ఎన్నో గ్రంథాలకు ఆముఖాలు, భూమికలు ప్రేరణలు వ్రాశారు. తెలుగు మాగాణంలో, ఏబది సంవత్సరాల వారి తపస్సులో వివిధ పత్రికలు వెలశాయి. జమీన్ రైతు, గోభూమి, క్రాంతి, నేటి 'వాహిని' రంగాజీ మేధస్సు నుండి ఉద్భవించినవే! కత్తిమీద సాముకంటే కూడ కష్టతరమైన పత్రికా నిర్వహణ భారాన్ని రంగాగారు మోశారు. మోస్తున్నారు. పత్రిక ప్రజల కొరముట్టు అని నమ్మిన శ్రీ రంగా తెలుగు జనంలో, వారి మనస్సులతో ఇంకిపోయిన మనిషిని. వీరికి సమకాలికులైనందుకు రచయితలంతా గర్వపడాలి.

